నేడే 101వ రాకెట్ ప్రయోగం



ఈవోఎస్-09 ఉపగ్రహాన్ని హీట్‌షీల్డ్‌లో అమర్చిన దృశ్యం

రాకెట్: పీఎస్ఎల్వీ-సీ 61
ఎత్తు: 44.5 మీటర్లు
బరువు: 321 టన్నులు

ఉపగ్రహం: ఈవోఎస్-09 (రీశాట్-1బీ)
బరువు: 1,696.24 కిలోలు
ప్రయోజనం: దేశ రక్షణ, సైనిక అవసరాలు



ప్రయోగ వేదికపై పీఎస్ఎల్వీ-సీ 61 రాకెట్

● పీఎస్ఎల్వీ శిఖర భాగంలో సిద్ధంగా రీశాట్-1బీ ఉపగ్రహం

సూళ్లూరుపేట, మే 17 (ఆంధ్రజ్యోతి) : పీఎస్ఎల్వీ-సీ 61 ప్రయోగ సన్నాహాలు శ్రీహరికోట రాకెట్ కేంద్రంలో పూర్తయ్యాయి.శాస్త్రవేత్తలతో షార్ సందడిగా మారింది. షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక మీద రాకెట్ నింగిలోకి ఎగిరేందుకు సిద్ధంగా ఉంది. అంతకుమునుపు పీఎస్ఎల్వీ ఇంటిగ్రేటెడ్ బిల్డింగ్ ఫెసిలిటీ (పీఐఎఫ్)లో రాకెట్ నాలుగు దశల అనుసంధాన పనులు పూర్తిచేసి ప్రయోగ వేదిక వద్దకు తరలించి రీశాట్-1బీ ఉపగ్రహాన్ని అనుసంధానం చేశారు. శనివారం ఉదయం 7.59 గంటలకు ప్రారంభమైన కౌంట్‌డౌన్ ఆదివారం ఉదయం వరకు 22 గంటలపాటు కొనసాగనుంది.కౌంట్‌డౌన్ సమయంలోనే రాకెట్‌లోని రెండవ, నాల్గవ దశల్లో ద్రవ ఇంధనాన్ని నింపే ప్రక్రియను శాస్త్రవేత్తలు పూర్తి చేశారు. ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ శుక్రవారం రాత్రి షార్‌కు చేరుకొని ప్రయోగ ఏర్పాట్లలో నిమగ్నమై వున్నారు. ప్రయోగ నేపథ్యంలో షార్‌లో భద్రతను కట్టుదిట్టం చేశారు. సముద్ర మార్గాన కూడా జల్లెడపట్టి గాలిస్తున్నారు.పీఎస్ఎల్వీ ప్రయోగాల్లో ఇది 63వ ప్రయోగం కాగా షార్ నుంచి 101 ప్రయోగం కావడం విశేషం. 18 నిమిషాల్లో నిర్ణీత కక్ష్యలోకి ఉపగ్రహాన్ని రాకెట్ చేరవేస్తుంది.

నాలుగు దశల్లో ..

139 టన్నుల ఘన ఇంధనం గల మొదటి దశ భూమికి 69 కి.మీ ఎత్తులోకి 111.64 సెకన్లకు పూర్తవుతుంది. 41 టన్నుల ద్రవ ఇంధనం గల రెండవ దశ 264.34 సెకన్లకు 231 కి.మీ ఎత్తులోకి ఉపగ్రహాన్ని తీసుకువెళ్తుంది. మూడో దశలో 7.65 టన్నుల ఘన ఇంధనం ఉంటుంది. 493 సెకన్లకు 443 కి.మీ ఎత్తులోకి శిఖరభాగాన్ని చేరుస్తుంది. 2.5 టన్నుల ద్రవ ఇంధనం గల నాలుగో దశ 503.40 సెకన్లకు ప్రారంభమై 1012.24 సెకన్లకు 533 కి.మీ ఎత్తులోకి చేరుతుంది. 1059.24 సెకన్లకు 530 కి.మీ ఎత్తులో నిర్ణీత కక్ష్యలోకి రీశాట్-1బీ ఉపగ్రహాన్ని చేరవేస్తుంది. ఉపగ్రహం కక్ష్యలోకి చేరిన వెంటనే భూకేంద్రాలకు సంకేతాలు అందుతాయి.



షార్ మొదటి గేటు వద్ద సీఐఎస్ఎఫ్ సిబ్బంది తనిఖీలు

● నేడు అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం

తగునా ఇది టీటీడీకి?

పురాతన సంపదపై నిర్లక్ష్యం

మూతబడ్డ తిరుమల, తిరుపతి మ్యూజియాలు





సనాతన సంప్రదాయానికీ, భారతీయ సాంస్కృతిక సంపదకూ సాక్ష్యమైన మ్యూజియంకు దిక్కులేకుండా పోయింది. తిరుమలలో అత్యంత సుందరమైన భవనంలో నెలకొల్పిన మ్యూజియంను ఆధునికీకరణ పేరుతో మూసేసి ఐదేళ్లు అయిపోగా, తిరుపతిలోని మ్యూజియంకు మంగళం పాడి రెండేళ్లు దాటింది. జగన్ ప్రభుత్వంలో చాపచుట్టేసిన అనేకానేకాల్లో ఈ హిందూ ఔన్నత్య సంపద కూడా ఒకటి. దాతలకు కొదవ లేదు. నిధులకు కొరత లేదు. లోపించిందల్లా చిత్తశుద్ధి మాత్రమే. టీటీడీ లాంటి ప్రపంచ ప్రసిద్ధ హిందూ ధార్మిక సంస్థ నిర్వహించే మ్యూజియంలు సమర్థంగా నడపలేకపోవడమే విచిత్రం.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

45 ఏళ్ల కిందట ప్రారంభమైన తిరుమల మ్యూజియం

తిరుమలలో 1980లో శ్రీవారి ఆలయం ముందున్న వేయికాళ్ల మండపంలో ఆర్ష సంస్కృతి సదస్సు పక్కన టీటీడీ మ్యూజియం ఏర్పాటు చేసింది. దీనిని 1996లో వైకుంఠం క్యూకాంప్లెక్స్1 ఎదురుగా 1.25 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలోని అందమైన భవనాల్లోకి తరలించారు.'శ్రీవేంకటేశ్వర మ్యూజియం' పేరుతో రూ.3.5కోట్లతో అప్పట్లో నిర్మించారు.

రూ.125 కోట్ల వితరణతో టాటా సంస్థ

ఈ మ్యూజియాన్ని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దాలని టీటీడీ నిర్ణయించింది. సహకరించేందుకు టాటా సంస్థ ముందుకు వచ్చింది. రూ.125 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేసేందుకు అంగీకారం తెలిపింది. అలాగే బెంగళూరుకు చెందిన మ్యాప్ సిస్టమ్స్ సంస్థ కూడా 'టెంపుల్ ఎక్స్‌పీరియన్స్ గ్యాలరీ' ఏర్పాటుకు రూ.20 కోట్లు ఇచ్చేందుకు అంగీకారం తెలిపింది. ఈ పనుల కోసమని 2020 మార్చి నుంచి మ్యూజియానికి భక్తుల అనుమతిని టీటీడీ రద్దు చేసింది. స్టేట్ ఆఫ్ ఆర్ట్ టెక్నాలజీతో 3డీ, 7డీ, హంగులతో 19 గ్యాలరీలతో ఎస్వీ మ్యూజియాన్ని అత్యాధునికంగా మార్చి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని టీటీడీ భావించింది. ఈ పనులన్నీ ఏడాదిలో పూర్తవుతాయని ప్రకటించింది. అయితే ఐదేళ్లయినా పనులు నత్తనడకన సాగుతున్నాయి.

కొరవడిన సమర్థుల సారథ్యం

జగన్ ప్రభుత్వంలోని అధికారులుగానీ, పాలక మండలిగానీ మ్యూజియం మీద తగినంత శ్రద్ధ పెట్టలేదు. పనులు చేసేందుకు పెద్ద సంస్థలు ముందుకు వచ్చినా పర్యవేక్షణ, సమన్వయం కొరవడింది. సమర్థులైన అధికారులను నియమించలేదు. రాజకీయ నియామకాలకే ప్రాధాన్యం ఇచ్చారు. భారతీయ సంస్కృతి పట్ల అవగాహన ఉన్న ఒక అధికారికి బాధ్యతలు అప్పగించి కూడా అతను అప్పటి అధికార పార్టీ నాయకుల సామాజిక వర్గం కాదనే కారణంతో ఆఖరి క్షణంలో మార్చేశారు. కోరుకున్న అధికారిని నియమించినా పనులు వేగంగా సాగేందుకు అధికారులు సహకరించలేదు. ఆ తర్వాత ఇద్దరు అధికారులను ఇన్‌చార్జులుగా బాధ్యతలు అప్పగించారు. మ్యూజియంపై వీరికి తగిన అవగాహన లేదనే విమర్శలు ఉన్నాయి.పనులు ముందుకు కదలకపోవడంపై టాటా సంస్థకు చెందిన ప్రతినిధులు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. ఒక మ్యూజియం అభివృద్ధికి ఏకంగా రూ.125 కోట్లు వెచ్చించడం చాలా పెద్ద నిర్ణయం. ఈ నిధులతో మ్యూజియంలో చేయాల్సినవేమిటో నిపుణుల సలహాలతో తగిన ప్రణాళిక రూపొందించుకుని ఇప్పటికే పూర్తి చేసి వుండవచ్చు. అయితే నిర్లక్ష్యానికి సాక్ష్యంగా మ్యూజియంలోని విలువైన పురాతన సంపద మూలన పడివుంది. ఇక విలువైన కొన్ని వస్తువులను హైదరాబాద్‌కు చెందిన సలార్‌జంగ్ మ్యూజియం నిపుణుల బృందం సంరక్షిస్తోంది.

మ్యూజియంలో ఏమున్నాయంటే..



తిరుమల సంప్రదాయాలు, వైష్ణవ మతం, హిందూ సంస్కృతికి ప్రతీకగా ఈ మ్యూజియాన్ని ఏర్పాటు చేశారు. 14, 15, 16 శతాబ్దాల నాటి రాతి, లోహ, స్ఫటిక, పాలరాతి విగ్రహాలు, పురాతన వాయిద్యాలు, రాజులు వాడిన కత్తులు, రక్షణ కవచాలు, యుద్ధంలో వినియోగించిన ఆయుధాలు, ముఖ్యంగా మైసూరు మహారాజు సమర్పించిన దంతపు పల్లకీ.. ఇలా ఆసక్తికరమైనవి ఎన్నో ఈ మ్యూజియంలో ఉన్నాయి. తిరుమలకు సంబంధించిన అద్భుతమైన ఫొటోలు ఉన్నాయి. బ్రహ్మోత్సవాలలో నిర్వహించే వాహనాలు, పుణ్యతీర్థాలు, నిజపాదాల రూపం, దశావతారాల ప్రతిమలు, శ్రీవారి ఆలయాన్ని అంచెలంచెలుగా నిర్మించిన సామంత రాజులు, శ్రీకృష్ణదేవరాయలు, తొడరమళ్లు, అచ్యుత దేవరాయలు, అట్ల కుమార అనంతరాజులు, వెంకటపతి దేవరాయల విగ్రహాల ఫొటోలు ఉన్నాయి. కపిలతీర్థం, తిరుచానూరు అమ్మవారి ఆలయంలో ఉపయోగించిన 18వ శతాబ్దానికి చెందిన గంటలు, కొయ్య పాదుకలు, స్వామివారి నిలువెత్తురూపం, ఇత్తడి పాదుకలు, రాగి పళ్లెం, దీప-ధూప స్తంభాలు, రాయలకాలం నాటి సంగీత వాయిద్యాలు, శ్రీనివాసమంగాపురం, గోవిందరాజుల స్వామి ఆలయం ప్రధాన ద్వారాలు, 17వ శతాబ్దంనాటి అలిపిరి చెక్క మండపం, శ్రీకృష్ణ లీలలు, శ్రీవారి రథంపై అలంకరించే తపోతదూళం, గరుడ, ద్వార పాలకుల విగ్రహాలు, వందల ఏళ్ల క్రితం నాటి నాణేలు.. ఇలా లెక్కకు మిక్కిలి ఉన్నాయి.తిరుమల ఆలయం 1,500ఏళ్ల చరిత్రను తెలిపేలా వెయ్యికిపైగా శాసనాలు,రాగిరేకులు ఉన్నాయి. 6వేలకుపైగా వస్తువులను ఎస్వీ మ్యూజియంలో ప్రదర్శనకు ఉంచారు.

2023లో మూతపడిన తిరుపతి మ్యూజియం



ఇక తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయానికి సమీపంలో ఎస్వీ మ్యూజియంను 1983లో ఏర్పాటు చేశారు. ఆలయ నిర్మాణం, శిల్ప శాస్త్రం, ఆగమ పద్ధతులు, శాస్త్రీయ నిర్మాణ రూపాలు, శ్రీవారి వాహనాలు, 108 దివ్యక్షేత్రాలు, సంగీత వాయిద్యాలు, కలంకారీ కళాచిత్రాలు ఇందులో ఉన్నాయి. అత్యంత విలువైన అన్నమయ్య కీర్తనల రాగిరేకులు కూడా ఈ మ్యూజియంలో ఉండేవి. మ్యూజియం ఏర్పాటు చేసిన పురాతన మండపంలో లీకేజీలు ఏర్పాడ్డాయి. దీంతో దీనిని కూడా 2023లో మూసివేశారు. ముఖ్యమైన వస్తువులను తిరుమలకు తరలించారు. ఇప్పుడు వాటి పరిస్థితి ఏమిటో అధికారులే చెప్పాల్సి ఉంది.

ఒక్కో పోస్టుకు 34మంది పోటీ

● డీఎస్సీకి అందిన దరఖాస్తులు 45,221
● ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1324 పోస్టులకు 26,501మంది అభ్యర్థుల పోటీ

చిత్తూరు సెంట్రల్, మే 17 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీకి పోటీ ఎక్కువగానే వుంది.గత నెల 20వ తేదీన మొదలైన డీఎస్సీ దరఖాస్తుల స్వీకరణ గడువు ఈనెల 15వ తేదికి ముగిసింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1324 పోస్టులకు 45,221దరఖాస్తులు అందాయి.వచ్చిన దరఖాస్తుల్లో పురుషుల కంటే అధికంగా 6195మంది మహిళా అభ్యర్థులు ఉన్నారు. జిల్లాలోని 1478 పోస్టులను రెండు విభాగాలుగా చేస్తూ దరఖాస్తులు స్వీకరించారు.జనరల్ కేటగిరిలో 1324 పోస్టులు, దివ్యాంగుల కేటగిరిలో 149 పోస్టులు కేటాయించారు. జనరల్ క్యాటగిరిలో ఒక్కో అభ్యర్థి ఒక్క పోస్టుకు మించి దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలోనే 26,501మంది అభ్యర్థులు ఏకంగా 45,221 దరఖాస్తులు చేసుకున్నారు. దీంతో ఒక్కో పోస్టుకు 34 మంది పోటీ పడనున్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో 10,153మంది పురుషులు, 16,348 మంది మహిళా అభ్యర్థులు ఉన్నారు. దివ్యాంగుల కేటగిరిలో మరో 149 పోస్టులకు గాను 2461 మంది దరఖాస్తు చేసుకున్నారు. అంటే ఒక్కో పోస్టుకు 16మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు.

డీఎస్సీ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 16,347 టీచర్ పోస్టులు భర్తీ చేయనుండగా, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1478 పోస్టులు భర్తీ కానున్నాయి. ప్రభుత్వ, జడ్పీ, ఎంపీపీ, మున్సిపల్ యాజమాన్యాల పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లు కేటగిరీలు, సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ, వ్యాయామ 1473 పోస్టులు భర్తీ చేయనుండగా, ట్రైబల్ వెల్ఫేర్ (ఆశ్రమ) పాఠశాలల్లో మరో ఐదు పోస్టులు(మ్యాథ్స్ 1, ఫిజిక్స్ 1, బయాలజీ 1, ఎస్జీటీ 2)తో మొత్తంగా 1478 టీచర్ పోస్టులు భర్తీ కానున్నాయి.

పోస్టు	జడ్పీ, ప్రభుత్వ మున్సిపాలిటీ
ఎస్జీటీ	976
ఎస్ఏ తెలుగు	38
ఎస్ఏ హిందీ	17
ఎస్ఏ ఇంగ్లీష్	104
ఎస్ఏ మ్యాథ్స్	30
ఎస్ఏ ఫిజిక్స్	29
ఎస్ఏ బయాలజి	63
ఎస్ఏ సోషల్	130
ఎస్ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్	86
ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలలు	05
మొత్తం	1478

దివ్యాంగుల కేటగిరిలో 149 పోస్టులకు 2461 దరఖాస్తులు

కేటగిరి	పోస్టులు	దరఖాస్తులు
ఈడబ్ల్యుఎస్	138	1664
పీహెచ్-విజువల్	1	134
పీహెచ్-హియర్	10	57
ఆర్థోపెడికల్	-	595
మెంటలీ ఇల్‌నెస్	-	11
	149	2461

● ఏపీ డీఎస్సీ ఉమ్మడి చిత్తూరు జిల్లా రోస్టర్ పోస్టులు, వచ్చిన దరఖాస్తులు

కేటగిరి	పోస్టులు	దరఖాస్తులు
ఓసీ	578	2856
బీసీ-ఏ	111	4000
బీసీ-బీ	139	3790
బీసీ-సీ	19	101
బీసీ-డీ	102	2570
బీసీ-ఈ	53	1661
ఎస్సీ-గ్రేడ్ 1	21	4
ఎస్సీ-గ్రేడ్ 2	94	1872
ఎస్సీ-గ్రేడ్ 3	112	7997
ఎస్టీ	95	1650
	1324	26,501

మే 20 నుంచి మాక్ టెస్టు : మెగా డీస్సీ ప్రక్రియలో భాగంగా తొలి దశ దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసిన వేళ, మే 20 నుంచి ఆన్‌లైన్ మాక్ టెస్టు అందుబాటులో ఉంటుంది. మే 30 నుంచి ఆన్‌లైన్‌లో డీఎస్సీ అభ్యర్థులు పరీక్షల హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. జూన్ 6వ తేదీ నుంచి జూలై 6వ తేదీ వరకు సబ్జెక్టుల వారీగా పరీక్షలు నిర్వహిస్తారు. ప్రతి పరీక్ష అనంతరం రెండు రోజుల్లో 'కీ'ని విడుదల చేస్తారు. ఏడు రోజుల అనంతరం ఫైనల్ 'కీ' విడుదల చేస్తారు. ఆ తర్వాత ఏడు రోజులకు డీఎస్సీ మెరిట్ (మార్క్ మెమో)విడుదల చేయనున్నారు.

సామాజిక బాధ్యతగా స్వచ్ఛాంధ్ర

● నాయుడుపేటలో మొక్కలు నాటిన కలెక్టర్ వెంకటేశ్వర్

నాయుడుపేట, మే 17 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్రను ప్రభుత్వ యంత్రాంగంతో పాటు ప్రతి పౌరుడూ సామాజిక బాధ్యతగా చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన నాయుడుపేట గోమతి సెంటర్ వద్ద ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటకం దీపిక, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లాతో కలసి మొక్కలు నాటారు. గాంధీ మందిరం పార్కు వద్ద పక్షులకు చిరుధాన్యాలు, తాగునీరు ఏర్పాటు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా రోగాలను దూరం చేయవచ్చునన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సూళ్లూరుపేట నియోజకవర్గంలో పరిసరాల శుభ్రతకు, పొడిచెత్త, తడిచెత్త సేకరణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ షేక్ రఫీ పాల్గొన్నారు.



గాంధీ మందిరం పార్కులో పక్షులకు చిరుధాన్యాలు ఏర్పాటు చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే విజయశ్రీ, మున్సిపల్ ఛైర్‌పర్సన్ దీపిక, మాజీ ఎంపీ నెలవల

ప్రకృతి వ్యవసాయ క్షేత్ర సందర్శన


ప్రకృతి సేద్య పొలంలో తమిళనాడు రైతులు

తిరుచానూరు, మే 17(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం వేమూరులో దామా అయ్యప్పనాయుడి పొలంలో ప్రకృతి సాగును మిషన్ చిన్నయ్య చెన్నై రూరల్ డెవలప్‌మెంట్ మహిళామండలి సభ్యులు, రైతులు శనివారం పరిశీలించారు. తిరుపతి డీపీఎం షణ్ముగం ప్రకృతి వ్యవసాయంపై 9 సార్వత్రిక సూత్రాలను వారికి వివరించారు. జీవామృతం, ఘన జీవామృతంపై తయారీ, ఫలితాలను వివరించారు. ఏటీఎం గ్రేడ్, పీఎండీఎస్ పద్ధతులను పొలంలో ప్రత్యక్షంగా చూపించారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం పట్టాభిరెడ్డి చిన్మయ మిషన్ డైరెక్టర్ ప్రియ, మాస్టర్ ట్రైనర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా టీడీపీ గ్రామకమిటీలు


నియామక పత్రం అందుకుంటున్న అనంతనేని బాలాజీ(పెద్దరామాపురం)

పాకాల, మే 17: మండలంలోని 12 గ్రామ పంచాయతీలకు టీడీపీ గ్రామ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల టీడీపీ కన్వీనర్ బి.నాగరాజనాయుడు, ప్రధాన కార్యదర్శి ఫల్గుణ కుమార్ ఆధ్వర్యంలో శనివారం ఎన్నికలు జరిగాయి. రమేష్ రెడ్డి, సింధుసుధ, ధనుంజయరెడ్డిల పర్యవేక్షణలో కమిటీలను ఎన్నుకున్నారు. గ్రామకమిటీ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులుగా అచ్చమ్మ అగ్రహారం-ఎం.సుబ్రమణ్యం, ఎన్.నాగమణినాయుడు, కె.వడ్డేపల్లె- బి.సుధాకర్ నాయుడు, పి.సుబ్రమణ్యం, కావలివారిపల్లె- కె.శివకుమార్, సురేంద్రబాబు, ఆదెనపల్లె- ఎం.గుణాకర్‌నాయుడు, పార్థసారథినాయుడు, మొగరాల-ఆర్.రాజేంద్ర ప్రసాద్ నాయుడు, పి.బ్రహ్మయ్య, గానుగపెంట- ఇ.సుబ్రమణ్యం, తేజకృష్ణ, పెద్దరామాపురం- ఎ.బాలాజీ నాయుడు, వి.శ్రీనివాసులు, వల్లివేడు- శివప్రసాద్ రెడ్డి, మహేష్ రెడ్డి, పదిపుట్లబైలు- జి.రఘు, సి.జయచంద్ర, పేరసానిపల్లె- పి.దాము, జి.నాగరాజు, రవణయ్యగారిపల్లె- జి.షాజహాన్, మునిరాజ, ఓబులశెట్టివారిపల్లె- జె.ఆనంద్, రఘురాంలు ఎన్నికయ్యారు.

తిరుమల పరిశుభ్రతలో స్థానికుల భాగస్వామ్యం


స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

తిరుమల, మే17(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర మిషన్‌లో భాగంగా తిరుమలలో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ తిరుమల కార్యక్రమాన్ని స్థానికులు నివసించే బాలాజీనగర్‌లో శనివారం నిర్వహించారు. ఈకార్యక్రమానికి హాజరైన అదనపు ఈవో వెంకయ్య చౌదరి, స్థానికులకు పారిశుద్ధ్యం-పరిశుభ్రతపై అవగాహన కల్పించి కమ్యూనిటీ భవనంలో వారితో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ప్రతిరోజు లక్షలాది మంది భక్తులు వచ్చే తిరుమల క్షేత్రంలో పరిశుభ్రతను కాపాడుకోవాల్సిన బాధ్యత స్థానికులపై ఉందన్నారు. ఈకార్యక్రమంలో డిప్యూటీఈవో సోమన్ నారాయణ, హెల్త్‌ఆఫీసర్ మధుసూదన్, వీఎస్‌వో సురేంద్ర పాల్గొన్నారు.

తిరుపతిరూరల్: దుర్గసముద్రంలో మూడోశనివారాన్ని పురస్కరించుకుని స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో రామచంద్ర, డీఎల్‌డీవో నారాయణరెడ్డి, పంచాయతీకార్యదర్శి నరసింహులు స్థానిక మహిళలు కలసి స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఎండతీవ్రత, చేపట్టాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో రామచంద్ర మాట్లాడుతూ..ప్రతి ఇంటిముందు ఇంకుడుగుంత తవ్వుకోవాలని, పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చౌడేశ్వరి దేవికి బోనాల సమర్పణ



భాకరాపేట, మే 17(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం తొగటపల్లెలోని చౌడేశ్వరి దేవి జ్యోతుల ఉత్సవాల సందర్భంగా శనివారం అమ్మవారికి అభిషేకాలు చేసి విశేష అలంకరణ చేశారు. మహిళలు అమ్మవారికి పొంగళ్లు పెట్టి బోనాలు సమర్పించారు. చలిమితో జ్యోతులు తయారు చేసి అమ్మవారి ఆయలం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఊంజల్ సేవ నిర్వహించి అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

చంద్రగిరిలో ఘనంగా తిరంగా ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే పులివర్తి నాని ,టీడీపీ శ్రేణుల

చంద్రగిరి, మే 17(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతమైనందుకు శనివారం చంద్రగిరిలో ఎమ్మెల్యే పులివర్తి నాని ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. నూర్ జంక్షన్ నుంచి టవర్ క్లాక్ వరకు జరిగిన ఈ భారీ తిరంగ ర్యాలీలో వందేమాతరం, భారత్ మాతాకి జై అంటూ నినాదాలు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్రవాదులకు ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్‌తో గట్టి బుద్ధి చెప్పిందన్నారు. దాడులు తిప్పికొట్టి ఉగ్రవాదుల స్థావరాలను తుదముట్టించిందన్నారు. డీసీఎంఎస్ ఛైర్మన్ సుబ్రమణ్యంనాయుడు, హేమాంబరధరరావు, నాయకులు ఈశ్వర్‌రెడ్డి, గౌస్‌బాషా, బడి సుధాయాదవ్, సింగు సుధా, తిరుమలరెడ్డి, బెల్లంకొండ మురళి, పాకాల జడ్పీటీసీ పద్మజ, మునిశేఖర్, పాల్గొన్నారు.

రేషన్ సరుకుల సరఫరాలో అలసత్వం వద్దు

చంద్రగిరి, మే 17(ఆంధ్రజ్యోతి): మండలంలో రేషన్ సరఫరాలో డీలర్లు అలసత్వం వహిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. శనివారం చంద్రగిరి ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని రేషన్ షాపు డీలర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నాని మాట్లాడుతూ ప్రతి కార్డుదారుడుకి రేషన్ సరుకులు అందేలా చూడాలన్నారు. డీలర్ సమయపాలన పాటించాలని, వేసవిలో కార్డుదారులను క్యూలైన్లో నిలబెట్టకూడదన్నారు. సమీక్షా సమావేశానికి హాజరుకాని డీలర్లను తొలగించాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ శివరామసుబ్బయ్య, సీఎస్‌డీటీ గంగయ్య, సీడీఎంఎస్ ఛైర్మన్ సుబ్రమణ్యంనాయుడు,ఏఎంసీ ఛైర్మన్ గౌస్‌బాషా, డీలర్లు పాల్గొన్నారు.

కోటా ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్ మెటీరియల్ సిద్ధం

తిరుపతి(విద్య), మే 17(ఆంధ్రజ్యోతి): ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు కోటా ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్ డిజిటల్ స్టడీ మెటీరియల్, అసైన్మెంట్లు సిద్ధం చేసినట్టు ఐఐటీ, నీట్ ఫోరం శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. మాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ ఫౌండేషన్ మెటీరియల్‌ను డిజిటల్ మొబైల్ వర్షన్‌లో వాట్సప్ ద్వారా విద్యార్థులు పొందవచ్చని పేర్కొంది. వివరాలకోసం 98490 16661 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

టైరు పేలడంతో పల్టీలు కొట్టిన కారు

● చిత్తూరు కమిషనర్ సహా ముగ్గురికి గాయాలు


దెబ్బతిన్న కారు

పాకాల, చిత్తూరు అర్బన్, మే 17 (ఆంధ్రజ్యోతి): కారు టైరు పేలడంతో అదుపుతప్పి రోడ్డుపైనున్న డివైడర్ ఢీకొని పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో చిత్తూరు నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహ ప్రసాద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. శనివారం సాయంత్రం విధులు ముగించుకున్న కమిషనర్ తిరుపతికి ఇన్నోవా కారులో బయల్దేరారు. ఆయనతోపాటు సీసీ అమరనాథరెడ్డి కూడా ఉన్నారు. చిత్తూరు-తిరుపతి మార్గమధ్యంలో పాకాల మండలంలోని గాదంకి టోల్‌గేట్ సమీపంలో వేగంగా వెళుతున్న వీరి కారు టైరు పగిలిపోయింది. దీంతో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని మూడు పల్టీలు కొట్టింది. ఎడమవైపు రోడ్డులో వెళ్తున్న వాహనం కుడివైపు త్రీలైన్ రోడ్డుపై బోల్తా పడింది.ఈ ప్రమాదంలో వాహనంలోని నరసింహ ప్రసాద్,అమరనాథరెడ్డిలతో పాటు డ్రైవర్ ప్రవీణ్ కుమార్‌కు గాయాలయ్యాయి.పూతలపట్టు ఎమ్మెల్యే పీఏ భాను ఆ దారిలో వెళుతూ ఈ ప్రమాదాన్ని గమనించి పోలీసులకు సమాచారమందించాడు.పాకాల సీఐ సుదర్శన ప్రసాద్ సంఘటనా స్థలానికి వెళ్లి గాయపడిన వారిని స్విమ్స్ ఆస్పత్రికి తరలించారు.

మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ

చంద్రగిరి, మే 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ద్వారకానగర్‌లోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈనెల 22 నుంచి నెల రోజుల పాటు మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగి, 19 నుండి 40 సంవత్సరాలున్న తిరుపతి, చిత్తూరు జిలా గ్రామీణ ప్రాంత నిరుద్యోగ మహిళలు శిక్షణకు అర్హులన్నారు. కనీసం పదోతరగతి చదివి ఉండాలన్నారు. సంస్థ ఫోన్ ద్వారా పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఉచిత భోజనం సౌకర్యం కల్పిస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్నవారికి సర్టిఫికెట్లను ఇస్తామన్నారు. బ్యాచ్‌కు 25 నుంచి 30 మంది మాత్రమే ఎంపిక చేస్తామన్నారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు జెరాక్స్ కాపీలు, 4 పాస్‌పోర్టు సైజు ఫోటోలతో సంస్థకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 7989680587, 9494951289, 6301717672 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

అమ్మవారి సేవలో గౌతమ్ గంభీర్

తిరుచానూరు, మే 17(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారిని శనివారం మాజీ క్రికెటర్, ఇండియా హెడ్‌కోచ్ గౌతం గంభీర్ దర్శించుకున్నారు. అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. మొదట ధ్వజస్తంభానికి నమస్కరించి అనంతరం అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ వేదపండితులు ఆయనను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

మద్యంషాపు తొలగించకుంటే నిరసన దీక్ష

తిరుపతి రూరల్, మే17(ఆంధ్రజ్యోతి): సాయినగర్ పంచాయతీలో ఇళ్లమధ్య ఏర్పాటు చేసిన మద్యంషాపునట వెంటనే తొలగించాలని గ్రామ సర్పంచ్ డీపీ రమణ డిమాండ్ చేశారు. విచారణకు వచ్చిన చిత్తూరు ఎక్సైజ్ అధికారి సుబ్రమణ్యంను శనివారం ఆయన కలసి వినతి సమర్పించారు. ఈసందర్భంగా రమణ మాట్లాడుతూ మూడునెలలుగా స్థానికులు మద్యంషాపు వద్దంటూ ఉద్యమిస్తున్నారని, గతంలో పంచాయతీలో కూడా తీర్మానించామన్నారు. షాపుసమీపంలో గుడి, బడి, మహిళల హాస్టల్, నివాసగృహాలు ఉన్నాయని, వెంటనే స్పందించి షాపుని తొలగించాలని, లేని పక్షంలో గ్రామస్తులు, మహిళలతో కలసి నిరవధికదీక్షకు దిగుతామని తెలిపారు.

తుడా టవర్స్ పనుల్లో వేగం పెంచాలి

తిరుపతి, మే17(ఆంధ్రజ్యోతి): తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) ఆధ్వర్యంలో అన్నమయ్య కూడలి వద్ద నిర్మిస్తున్న తుడ టవర్స్ నిర్మాణ పనులను శనివారం వీసీ ఎస్.మౌర్య అధికారులతో కలసి పరిశీలించారు. అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయంలో టవర్స్ పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుడా టవర్స్ పనులు ఆలస్యం అవుతున్నాయని, నిర్దేశిత సమయంలో పూర్తిచేయాలని అన్నారు. పనుల్లో నాణ్యత పాటించాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్ఈ కృష్ణారెడ్డి, ఈఈ రవీంద్ర పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో రక్షణమంత్రి సాంకేతిక సలహాదారు



శ్రీకాళహస్తి, మే 17 (ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూ నాంబ సమేత శ్రీకాళ హస్తీశ్వరస్వామిని శనివారం భారత రక్షణ మంత్రి సాం కేతిక సలహాదారు, డీఆర్‌డీవో మాజీ ఛైర్మన్ సతీష్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శిం చుకున్నారు. ఆలయం వద్ద ఈవో బాపిరెడ్డి వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అంద జేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు కృష్ణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, హరియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టు తప్పితే.. పెను ప్రమాదమే!



ఈ ఫొటో చూశారా.. ఆటోలో కిక్కిరిసి ఎలా ప్రయాణిస్తున్నారో. ఇదెక్కడో గ్రామీణ రహదారిలో కాదు. రూరల్ మండల పరిధిలోని పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిలో శనివారం కనిపించిన దృశ్యమిది. డ్రైవర్ స్టీరింగ్,గేర్లను అదుపుచేయాలన్నా కష్టమే. ఇంటర్మీడియట్ పరీక్ష రాసిన దాదాపు 20మంది విద్యార్థులు కూడా ఇలాగే మరోఆటో ఎక్కి తుమ్మలగుంటలోని కళాశాల హాస్టల్‌కు చేరుకున్నారు. ప్రమాదభరిత ప్రయాణాలను అధికారులు కట్టడి చేయాలి .

-తిరుపతి రూరల్ (ఆంధ్రజ్యోతి).

తుడా బెంచీలకు రంగులేస్తే రాజకీయమా?

వైసీపీ నేతల అడ్డగింతపై టీడీపీ ఆగ్రహం


ఉప్పరపల్లిలో ఇరువర్గాల వాగ్వాదం

తిరుపతి రూరల్, మే17(ఆంధ్రజ్యోతి): తుమ్మలగుంట పంచాయతీలో తుడా నిధులతో ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీలపై రంగులేసేందుకు వచ్చిన కాంట్రాక్టర్‌ని శనివారం గ్రామ వైసీపీనేతలు అడ్డుకున్నారు. గ్రామస్థులందరితో చర్చించి ఓనిర్ణయానికి వచ్చేవరకూ రంగులేయొద్దని వెనక్కి పంపించేశారు. ఇదేతరహాలలో ఉప్పరపల్లెలోనూ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డిభాస్కర్‌రెడ్డి తమ్ముడు రఘునాథరెడ్డి, మాజీ ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, మరికొందరు నేతలు అడ్డుకున్నారు. విషయం తెలుసుకుని టీడీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రచార కార్యదర్శి దొడ్ల కరుణాకర్‌రెడ్డి, స్థానిక నేత అయ్యప్ప తదితరులు చేరుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో తుడా నిధులతో ఏర్పాటుచేసిన సిమెంటు బెంచీలకు రంగులేస్తుంటే అడ్డుకోవడం సరికాదన్నారు. తుడా నుంచి సదరు కాంట్రాక్టర్ కాంట్రాక్ట్ పొందారాన్నరు. ఇరు పార్టీల నేతల మధ్య కొంతసేపు వాగ్వాదం జరిగింది. పదిరోజుల్లో అందరితో చర్చించి నిర్ణయానికి వస్తామని వైసీపీ నేతలు చెప్పుకొచ్చారు. సీఐ చిన్నగోవిందు, ఎస్ఐ రామకృష్ణ, పోలీసులు చేరుకున్నారు. అప్పటికే వివాదం సద్దుమణగడంతో వెనుతిరిగారు.

చెవిరెడ్డి రెచ్చగొట్టే ధోరణి మార్చుకోవాలి:

రెచ్చగొట్టే వ్యాఖ్యలతో గ్రామస్థుల మధ్య గొడవలు పెంచే వైఖరిని చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి విడనాడాలని దొడ్ల కరుణాకర్ రెడ్డి హితవు పలికారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంట్రాక్టర్ పట్ల బెదిరింపు ధోరణితో వ్యవహరించడం సరికాదన్నారు. పసుపురంగు అంటే భయపడుతున్నారని విమర్శించారు. తుడా నిధులతో ఏర్పాటు చేసిన బెంచీలను సొంతనిధులతో ఏర్పాటు చేసినట్లుగా అడ్డుకోవడంలో అర్థంలేదన్నారు. వైసీపీనేతలు చెప్పిన విధానంగా నాలుగురోజుల్లో గ్రామస్థులందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయాన్ని తీసుకోవాలన్నారు.

అన్నయయ్య సంకీర్తనల్లో పురాణాల సారాంశం


అన్నమయ్య కీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 17 (ఆంధ్రజ్యోతి): పురాణాలు, ఉపనిషత్తుల సారాన్ని అన్నమయ్య తన కవిత్వం ద్వారా తెలియజేశారని శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ మాజీ వీసీ ఆచార్య అనుమాండ్ల భూమయ్య పేర్కొన్నారు. అన్నమాచార్య జయంతి ఉత్సవాల్లో భాగంగా అన్నమాచార్య కళామందిరంలో శనివారం నిర్వహించిన సాహితీ సదస్సులో ఆయన ప్రసంగించారు. పురాణసారాన్ని శ్రీవారికి అన్వయించి, స్వామి మహిమలను భక్తులకు కీర్తనల ద్వారా అన్నమయ్య అందించారని తెలిపారు. అన్నమయ్య, వెంగమాంబ ఇద్దరూ శ్రీవారిని తమ సాహిత్యంతో అభిషేకించారని అన్నారు. ఆచార్య తాడేపల్లి పతంజలి మాట్లాడుతూ.. అన్నమయ్య రాసిన వందలాది సంకీర్తనల్లో జీవుడి వర్ణన కనిపిస్తుందన్నారు. హైదరాబాదుకు చెందిన గంధం బసవశంకరరావు మాట్లాడుతూ అన్నమయ్య సాహిత్యాన్ని ఈ తరం పరిశోధకులు ప్రాచుర్యంలోకి తేవాలని కోరారు. అనంతరం తిరుపతికి చెందిన మాధురి సంగీత కచేరి, నెల్లూరుకు చెందిన రమణయ్య హరికథ అందరినీ ఆకట్టుకున్నాయి. అన్నమాచార్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి డాక్టర్ మేడసాని మోహన్, ప్రోగ్రాం అసిస్టెంట్ లత, సిబ్బంది, కళాకారులు పాల్గొన్నారు.

రేపు సుగుణమ్మ బాధ్యతల స్వీకారం


సీఎంను కలిసిన సుగుణమ్మ

తిరుపతి, మే17(ఆంధ్రజ్యోతి): ఏపీ గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ (ఏపీజీబీసీ)గా నియమితులైన తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. విజయవాడలోని మైలాపురం హోటల్లో జరగనున్న ప్రమాణస్వీకారానికి తిరుపతి నుంచి పార్టీ శ్రేణులు హాజరుకానున్నారు. కాగా శనివారం మంగళగిరిలో సీఎం చంద్రబాబును ఆమె మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు.

స్నేహితులతో సరదాగా ఈతకెళ్లి యువకుడి మృతి

రేణిగుంట, మే 17 (ఆంధ్రజ్యోతి): స్నేహితులతో సరదాగా ఈతకు వెళ్లి యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం సాయంత్రం మాముండూరులో జరిగింది. రేణిగుంట అర్బన్ స్టేషన్ రైటర్ గిరినాయుడు తెలిపిన వివరాలు... స్థానిక జ్యోతినగర్‌కు చెందిన ఆంటోని(27) విమానాశ్రయంలో లోడర్. శుక్రవారం స్నేహితులతో కలిసి మాముండూరులోని మిత్రుడి ఇంటికి వెళ్లారు. అక్కడ నుంచి సమీపంలోని లక్ష్మమ్మ బాయి వద్ద మద్యం తాగారు. అనంతరం సరదాగా బావిలో ఈతకు దిగారు. అదే సమయంలో ఆంటోని మునిగిపోయాడు. అక్కడే ఉన్న స్థానికులకు, పోలీసులకు స్నేహితులు సమాచారం ఇచ్చారు. అయితే పోలీసులు వచ్చే సమయానికి చీకటి పడింది. దీంతో శనివారం ఉదయం బావిలో ఉన్న మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం రుయా ఆస్పత్రికి తరలించారు.

మురుగు కాలువలో పడి...

రేణిగుంట పారిశ్రామిక వాడలోని మురుగు కాలువలో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుడి వయసు 40- 45 సంవత్సరాల మధ్య ఉంటుందని తెలిపారు. మెడలో స్టీల్ చైన్, కుడి చేతికి స్టీల్ కడియం, బ్లూ రంగు టీ షర్టు, పచ్చ రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు.మృతదేహాన్ని రుయా ఆస్పత్రికి తరలించారు.

అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా: ఇద్దరికి స్వల్ప గాయాలు



బుచ్చినాయుడుకండ్రిగ, మే 17 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని తడ - శ్రీకాళహస్తి రోడ్డు కాంపాళెం గిరిజన కాలనీ మలుపు దగ్గర అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా పడటంతో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. బీఎన్ కండ్రిగ నుంచి శుక్రవారం మతకముడికి చెందిన ముగ్గురు ట్రాక్టర్‌లో వెళ్తుండగా కాంపాళెం గిరిజన కాలనీ మలుపు దగ్గర ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించ బోయి ట్రాక్టర్ బోల్తా పడింది.

ఎస్వీయూ ఐ, ఎఫ్ -బ్లాక్ హాస్టళ్ల మూత

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 17 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూనివర్సిటీ ఐ-బ్లాక్, ఎఫ్-బ్లాక్ హాస్టళ్లను మూత వేశారు. వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, వర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ భాస్కర్ రెడ్డి, వార్డెన్ బాలాజీ తదితరులు శనివారం ఈ హాస్టళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలామంది ఫీజులు చెల్లించకుండా హాస్టళ్లలో ఉన్నారని తెలియజేశారు. పలువురు అనధికారికంగా ఉంటున్నారని పేర్కొన్నారు. బయటి వ్యక్తులను, రాజకీయ పార్టీలకు అనుబంధంగా ఉన్న వారిని కట్టడి చేయడానికే తాత్కాలికంగా మూతవేస్తున్నట్లు తెలియజేశారు. బిల్లులు చెల్లించిన వారికి కొన్నిరోజుల తర్వాత ఈ బ్లాక్‌లు తిరిగి ప్రారంభిస్తామని వివరించారు.

విశ్వం స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ



తిరుపతి(విద్య), మే 17(ఆంధ్రజ్యోతి): విశ్వం విద్యాసంస్థల సైనిక్, నవోదయ స్టడీ మెటీరియల్ ను ఎమ్మెల్సీ సి.రామచంద్రారెడ్డి ఆవిష్కరించారు. స్థానిక వరదరాజనగర్‌లోని విశ్వం టాలెంట్ స్కూల్లో శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ, అప్పస్టా రాష్ట్ర అకడమిక్ కో-ఆర్డినేటర్ వీఆర్ రెడ్డి ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. విశ్వం విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథ్‌రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డితో కలిసి స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరించారు

నిరాధార ఆరోపణలు మానండి

● కట్టా గోపి యాదవ్

తిరుపతి(ఎంఆర్‌పల్లె), మే 17(ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకులు నిరాధార ఆరోపణలు చేయడం మానుకోవాలని గంగమ్మగుడి మాజీ ఛైర్మన్ కట్టా గోపియాదవ్ అన్నారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ నాయకులు తాతయ్యగుంట గంగమ్మజాతరను సరిగ్గా జరిపించకపోవడంతో భక్తులు అసంతృప్తిలో ఉన్నారని తెలియజేశారు. ఇది గుర్తించిన టీడీపీ నాయకులు మబ్బు దేవనారాయణరెడ్డి తదితరులు మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిపై నిరాధార ఆరోపణలు చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు ధనశేఖర్, శివాచారి, ప్రకాష్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో జోరు వాన



తిరుపతి కరకంబాడి రోడ్డులో వానకు వాహనచోదకుల అవస్థలు- అమెరికన్ బార్ వద్ద డ్రైనేజీ మ్యాన్‌హోల్‌లో కలుస్తున్న వర్షపు నీరు



తిరుపతి అర్బన్, మే 17(ఆంధ్రజ్యోతి): నగరంలో శనివారం సాయంత్రం ఓ మోస్తారు వర్షం కురిసింది. దీంతో నగర వాసులకు ఉక్కపోత నుంచి కాస్త ఉపశమనం లభించింది. పగలంతా భానుడి భగభగలతో జనం అల్లాడిపోయారు. సాయంత్రం ఉన్నట్టుండి ఆకాశం మేఘావృతమైంది. హోరు గాలులతో జోరువాన కురిసింది. వాహన చోదకులు, యాత్రికులు, ప్రయాణికులు అవస్థలు పడ్డారు. వీధుల్లో వర్షపునీరు జోరుగా ప్రవహించింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొందరు పిల్లలు వర్షంలో చిందులేస్తూ కనిపించారు. అక్కడక్కడ వర్షపునీటితో కలిసిన డ్రైనేజీ పొంగి పొర్లింది. దీంతో రోడ్లపైకి వ్యర్థాలు కొట్టుకొచ్చాయి. కాసేపటికే వర్షం తగ్గిపోయింది. వాతావరణం కాస్త చల్లబడడంతో వాతావరణం ఆహ్లాదంగా మారింది.

సీబీఎస్‌లో ఆటోమేటిక్ అనౌన్స్‌మెంట్


ఆటోమెటిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్‌ను ప్రారంభిస్తున్నా డీపీటీవో, ఏటీఎం

తిరుపతి(ఆర్టీసీ), మే 17(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ బస్సుస్టేషన్‌లో ఆటోమేటిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్‌ను తొలిసారిగా ఏర్పాటు చేశారు. ఈ విధానాన్ని శనివారం జిల్లా ప్రజారవాణాధికారి వెంకటరావు ప్రారంభించారు. రిజర్వేషన్ విధానం కలిగివున్న ప్రతి బస్సు 500మీటర్ల దూరం నుంచి సీబీఎస్‌కు ప్రవేశిస్తుండగా ఆటోమేటిక్‌గా అనౌన్స్‌మెంట్ వినిపిస్తుంది. త్వరలోనే అన్ని బస్సులకు ఈ విధానం విస్తరించేలా చర్యలు చేపడుతామని డీపీటీవో తెలియజేశారు. అనంతరం స్వచ్ఛఆంధ్ర -స్వర్ణఆంధ్ర కార్యక్రమంలో భాగంగా వైద్య, ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఆర్టీసీ డ్రైవర్లకు, ప్రయాణికులకు పంపిణీ చేశారు. అలాగే పలువురు పారిశుధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. బస్టాండు ఏటీఎం రామచంద్రనాయుడు, సంధ్య, ఈఈ లక్ష్మీనారాయణ, ఈ.ఆర్.కుమార్, పురుషోత్తం, హర్ష తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రోడ్డును తొలగించిన రెవెన్యూ


కాలువపొరంబోకులో వేసిన రోడ్డును తొలగించిన రెవెన్యూ

తిరుపతి అర్బన్, మే 17(ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతమైన మంగళం గ్రామ లెక్కదాఖలా సర్వేనెంబరు 118లో కాలువ పొరంబోకు 7.45ఎకరాల స్థలం ఆక్రమణకు గురైంది. ఓ వ్యక్తి గురువారం రాత్రి అక్రమంగా అందులో తన స్థలానికి ఏకంగా రోడ్డు వేసుకున్నాడు. మంగళం-శెట్టిరోడ్డులోని ఆస్థలానికి అనుకొని వున్న ప్రైవేటు వ్యక్తి రోడ్డు వేసుకున్నాడని స్థానికులు రెవెన్యూ సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి ఆదేశాల మేరకు రెవెన్యూ విభాగం స్పందించింది. శుక్రవారం ఎక్స్‌కవేటర్‌తో రోడ్డుకు పరిచిన కంకరను తొలగించారు. మరోసారి అక్రమంగా రోడ్డు వేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా ఆ స్థలంలో సమగ్ర సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మరిన్ని కూడళ్లలో చలువపందిళ్లు


అవార్డు ప్రదర్శిస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

తిరుపతి అర్బన్, మే 17(ఆంధ్రజ్యోతి): నగరంలో మరిన్ని కూడళ్లలో చలువపందిళ్ల ఏర్పాటుచేస్తామని ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు ప్రకటించారు. ఆ సంఘం తమ సొంతనిధులతో ఇటీవల నగరంలోని భవానీనగర్ కూడలి, టౌన్‌క్లబ్ కూడలిలో చలువపందిళ్ల ఏర్పాటు చేసింది. దీంతో వాహనచోదకులకు ఎంతో ప్రయోజనకరంగా ఉండడంతో ప్రజల నుంచి, నగరపాలక సంస్థ నుంచి అభినందనలు లభించాయి. అంతేకాకుండా నగరపాలక సంస్థ శనివారం బీట్ ద హీట్ పార్టిసిపేషన్-2025, స్వచ్ఛఆంధ్ర-స్వర్ణఆంధ్ర ప్రశంసాపత్రం ఆర్యవైశ్య సంఘానికి ప్రదానం చేసింది. దాంతో తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అవార్డులను ప్రదర్శించి ఇదే స్ఫూర్తితో బాలాజీ కాలనీ, అన్నమయ్య, ఎంఆర్‌పల్లి కూడలిలో కూడా చలువపందిళ్లను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు దిండుకుర్తి నరసింహులు, మహేష్, సురేష్, రామమూర్తి, సుష్మశేఖర్, శ్రీదేవి, వెంకటేశ్వర్‌గుప్తా, హేమచంద్ర తదితరులు పాల్గొన్నారు.

తుడాపై శ్వేతపత్రం విడుదల చేయాలి

తిరుపతి(ఆటోనగర్)మే17(ఆంధ్రజ్యోతి): తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థకు సంబంధించిన ఆస్తులు ఆదాయ వివరాలపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

కార్యాలయాల్లో శుభ్రత పాటిద్దాం


పరిసరాలు శుభ్రం చేస్తున్న సీఎండి సంతోషరావు తదితరులు

తిరుపతి(ఆటోనగర్) మే 17 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్‌పీడీసీఎల్ కార్యాలయాల్లో ప్రతి మూడవ శనివారం పరిశుభ్రత ప్రమాణాలు పాటించాలని సీఎండీ కే.సంతోష రావు అధికారులను ఆదేశించారు. తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో శనివారం స్వర్ణఆంధ్ర-స్వచ్ఛఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కార్యాలయం ప్రాంగణంలోని పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు పి.అయూబ్‌ఖాన్, కె.గురవయ్య, సీజీఎంలు జె.రమణాదేవి, జానకిరామ్, ఎస్.శోభావాలెంటీనా, కేఆర్ఎస్. ధర్మజ్ఞాని, జాయింట్ సెక్రటరీ గోపాలక్రిష్ణ, జీఎంలు పి.మురళి, సి.ప్రసాద్, సురేంద్రరావు, రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

'మా భూమిలో రోడ్డేస్తున్నారు'

తిరుపతి(ఎంఆర్‌పల్లె), మే 17(ఆంధ్రజ్యోతి): తమ అనుభవంలో ఉన్న భూమిని ఆక్రమించి ప్రయివేటు వెంచర్‌కు రోడ్డు వేసుకుం టున్నారని రేణిగుంట మండలం కృష్ణాపురానికి చెందిన నాగముంతల రవి ఆరోపించారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు మీడియాతో ఆయన మాట్లాడుతూ కృష్ణాపురం గ్రామ లెక్క దాఖల సర్వే నెంబరు 308/8లో తమ పిత్రార్జితంగా సంక్రమించిన 3.30ఎకరాల భూమిలో దౌర్జన్యంగా రోడ్డు ఏర్పాటు చేశారన్నారు. కలెక్టరేట్‌లో జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఐదుసార్లు అర్జీలు ఇచ్చినా తమకు న్యాయం జరగలేదని తెలిపారు.

మానవ మనుగడకు మొక్కలే ఆధారం


సెట్విన్ కార్యాలయ ప్రాంగణంలో మొక్క నాటుతున్న ఉద్యోగులు

తిరుపతి అర్బన్, మే 17(ఆంధ్రజ్యోతి): స్థానిక చెన్నారెడ్డికాలనీలోని సెట్విన్ కార్యాలయంలో శనివారం స్వర్ణఆంధ్ర-స్వచ్ఛఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. సీఈవో మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో కార్యాలయం ప్రాంగణమంతా శుభ్రపరిచారు. అరుదైన మొక్కలు నాటారు. చలివేంద్రం ఏర్పాటుచేశారు.

రక్తపోటును నిర్లక్ష్యం చేస్తే ముప్పు తప్పదు


ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్

తిరుపతి(వైద్యం), మే 17 (ఆంధ్రజ్యోతి): రక్తపోటును నిర్లక్ష్యం చేస్తే ముప్పు తప్పదని రక్తపోటుపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్ అన్నారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా ఆయన స్థానిక వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ముందు నిర్వహించిన అవగాహన ర్యాలీని జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక వ్యాయామం, యోగాతో రక్తపోటును అదుపులో ఉంచుకోవచ్చన్నారు. రక్తపోటు లక్షణాలు, నివారణ మార్గాలు, ఆరోగ్య సలహాలను వివరిస్తూ ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు శ్రీనివాసులరెడ్డి, మురళీకృష్ణ, ఛత్రప్రకాష్‌రెడ్డి, రెడ్డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి

డ్రాయింగ్స్, పెయింటింగ్స్, వ్యాసరచన పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ


తాము వేసిన డ్రాయింగ్, పెయింటింగ్స్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

తిరుపతి అర్బన్, మే 17(ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ డే ఆఫ్ బయోలాజికల్ డైవర్శిటీ-2025సందర్భంగా పద్మావతి మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం డ్రాయింగ్, పెయింటింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లాలలోని పలు జడ్పీ హైస్కూల్, ఎస్వీడబ్ల్యూ డిఫార్మశీ విద్యార్థినులు విచ్చేశారు. డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలలో కె.తేజస్విని ప్రథమ స్థానంలో గెలుపొంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. పి.మాయ (ద్వితీయ), బి.మహేశ్వరి, గుణసుంధరీలు (తృతీయ) స్థానంలో నిలిచారు. వ్యాసరచన పోటీలలో లతిక (ప్రథమ), పి.లహరి(ద్వితీయ), జె.తేజస్విని, కె.వర్షిత(తృతీయ)స్థానం సాధించారు. వారికి బహుమతులు ప్రదానం చేశారు. టీటీడీ డీఈవో వెంకటసునీల్, ప్రిన్సిపాల్ డాక్టర్.ఎం.పద్మావతమ్మ, నీల కంఠయ్య అభినందించారు.

5న ఏపీజీఈఏ రాష్ట్ర మహాసభలు


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు

తిరుపతి(విద్య), మే 17(ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 5న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం 3వ రాష్ట్ర మహాసభలు విజయవాడలో నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీపతి, జిల్లా అధ్యక్షులు ప్రసాద్‌రెడ్డి తెలియజేశారు. స్థానిక వాణిజ్య పన్నులశాఖ కార్యాలయం ఆవరణలో ఈ మేరకు మహాసభల వాల్‌పోస్టర్లను, బ్యానర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మహాసభకు తిరుపతి జిల్లా నుంచి ఉద్యోగ ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పెద్దసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్.సుబ్బరాయుడు, కోశాధికారి మధుబాబు, పురుషోత్తంరెడ్డి, లక్ష్మీకర్‌రెడ్డి, కిరణ్, రాజేష్, మధు, రామచంద్ర, పలువురు సభ్యులు పాల్గొన్నారు.


వారధికి ఏర్పడిన పగుళ్లు


వారధికి చేపట్టిన మరమ్మతులు

వామ్మో వారధి!

మరమ్మతులు, లోడ్ టెస్ట్‌లతో వాహనదారుల్లో ఆందోళన

ఎలాంటి ఢోకా లేదంటున్న నిపుణులు

తిరుపతి- ఆంధ్రజ్యోతి: మొన్న అలిపిరి పోలీస్‌స్టేషన్ సమీపంలోని గరుడ వారధిపై కొంత మేర రోడ్డు తవ్వేసి ఇనుమ దిమ్మెలు కనిపించేలా మరమ్మతు చేయడం మొదలుపెట్టారు. నిన్న లోడ్ టెస్ట్ పేరిట రామానుజ సర్కిల్ నుంచి శ్రీనివాసం వరకు వారధిపై రాకపోకలు నిలిపివేశారు. దీంతో గరుడ వారధిపై ప్రయాణికుల్లో అనుమానాలు నెలకొన్నాయి. అయితే వారధి భద్రతపై ఎలాంటి అనుమానాలూ అవసరం లేదని, సాధారణ మరమ్మతులేనని ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు.

ఆర్వోబీపై లోడ్ టెస్ట్ సాధారణమే
మోహన్, మాజీ ఎస్ఈ, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్

ఎక్కడైనా రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్‌వోబీ)పైన వారధి నిర్మిస్తే లోడ్ టెస్ట్ చేయాలి. రైల్వే, ఆఫ్కాన్స్, కార్పొరేషన్ సంయుక్తంగా టెస్ట్ చేయాల్సి ఉంటుంది. తిరుపతిలోని గరుడ వారధి ప్రారంభానికి ముందు లోడ్ టెస్ట్ చేయడం కుదరలేదు. ఇప్పుడు చేస్తున్నారు. 280 టన్నుల సామర్థ్యం వారధి భరించాల్సి ఉంటుంది. వారం రోజుల పాటు భారీ బరువులతో ఆర్వోబీ ఉన్న చోట లోడ్ టెస్ట్ చేస్తారు. అంతేగాని వారధి నిర్మాణంపై ఎలాంటి అనుమానాలూ అవసరం లేదు.

వేసవిలో శబ్దం రావడం సహజమే
రంగస్వామి, మేనేజర్, కాంట్రాక్ట్ సంస్థ ఆఫ్కాన్స్

అలిపిరి పోలీస్ స్టేషన్ సమీపంలోని వారధిపై వాహనాలు వెళుతున్నప్పుడు ఎక్కువ శబ్దం వస్తున్నట్టు నెల రోజులుగా గుర్తించాం. సాధారణంగా ఫ్లైవోవర్లపై వేసవి కాలంలో స్టీల్ (ఇనుము దిమ్మలు) వ్యాకోచించడం వల్ల ఇలాంటివి జరుగుతుంటాయి. వాటిని గుర్తించి మరమ్మతులు చేయడం సాధారణమైన విషయం. ఇది కేవలం సాంకేతికమైన అంశమే.

స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రలో 'బీట్ ద హీట్'



తిరుపతి, మే17(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం 'బీట్ ద హీట్' నినాదంతో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఎండ తీవ్రతలను తగ్గించేలా మొక్కలు నాటడం, చలివేంద్రాలు ఏర్పాటు, పశు పక్షాదుల కోసం నీటి తొట్టెల ఏర్పాటు, పారిశుధ్య కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, టోపీలను అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మౌర్య మాట్లాడుతూ నగరంలో ఎండ నుంచి రక్షణ పొందేలా మరిన్ని కార్యక్రమాలకు రూపకల్పన చేస్తున్నామని అన్నారు. శాప్ చైర్మన్ రవినాయుడు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, డిప్యూటీ మేయర్ మునికృష్ణ మాట్లాడుతూ వాతావరణ సమతుల్యత దెబ్బతినకుండా మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఊకా విజయకుమార్, కార్పొరేటర్లు అన్నా అనిత, రేవతి, ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు, అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, మున్సిపల్ ఇంజనీర్ తులసికుమార్, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

పురమిత్ర యాప్ ఆవిష్కరణ : పురమిత్ర యాప్‌ను నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఆవిష్కరించారు. నగరపాలక సంస్థకు సంబంధించిన సేవలు ఈ యాప్‌లో ఉన్నాయని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, రెవెన్యూ ఆఫీసర్ రవి పాల్గొన్నారు.

రిటైర్డు ప్రొఫెసర్ ఇంట్లో చోరీ

బంగారు నగలు, నగదు, వెండి అపహరణ


దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న డీఎస్పీలు, పోలీసులు

తిరుపతి(నేరవిభాగం) మే 17 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన విశ్రాంత ప్రొఫెసర్ ఇంట్లో దొంగలు పడ్డారు. బంగారు నగలు, వెండి వస్తువులు, నగదు, ఒక టీవీ, 250 డాలర్ల కరెన్సీ చోరీ చేశారు. ఎస్వీయూనివర్శిటీ సీఐ రామయ్య కథనం మేరకు.. పుల్లారెడ్డి ఎస్వీయూలో లైబ్రరీ సైన్సులో ప్రొఫెసర్‌గా పనిచేసి రిటైరయ్యారు. ఆయన కుమార్తె, అల్లుడు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేస్తున్నారు. పది రోజుల క్రితం ఇతర కుటుంబసభ్యులతో కలిసి బెంగళూరులోని కుమార్తె ఇంటికి వెళ్లారు. శుక్రవారం అర్ధరాత్రి దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించారు. బెడ్‌రూము లాకర్‌లో వున్న 150 గ్రాముల బంగారు నగలు, మూడు కిలోల వెండి వస్తువులు, ఒక టీవీ, 250 డాలర్ల కరెన్సీ, మిక్సీ, పట్టుచీరలు, ఇంటి సరకులు అపహరించుకుని వెళ్లారు. శనివారం తిరుపతికి వచ్చిన పుల్లారెడ్డి చోరీ విషయాన్ని గుర్తించారు. తిరుపతి ఎస్వీయూ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డీఎస్పీ భక్తవత్సలం, క్రైం డీఎస్పీ శ్యాంసుందర్, సీఐ రామయ్య, వేలి ముద్రల నిపుణులు, డాగ్ స్క్వాడ్‌లు వెళ్లి ఆ ఇంటిని పరిశీలించారు. వేలి ముద్రలు సేకరించారు. క్రైం డీఎస్పీ శ్యాంసుందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీటీడీ వసతి సముదాయాల్లో భద్రతపై ప్రత్యేక దృష్టి

ఫింగర్ ప్రింట్ స్కానర్, సీసీ కెమరాల ఏర్పాటుకు నిర్ణయం

తిరుపతి(నేరవిభాగం) మే 17(ఆంధ్రజ్యోతి): టీటీడీ వసతి సముదాయాల్లో చోరీలు పెరుగుతున్న నేపథ్యంలో భద్రతపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. శనివారం డీఎస్పీ భక్తవత్సలం విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ మోహన్ రెడ్డి, ఈస్ట్ సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ గిరిధర్‌తో సమావేశమయ్యారు. విష్ణునివాసం, శ్రీనివాసంలో వీఐపీలు, ప్రముఖులు బసచేసే అవకాశమున్నందున నిఘా పెంచాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతమున్న సీసీ కెమరాలతో పాటు అదనంగా 300 ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. భక్తులకు లాకర్లు ఇచ్చే సమయంలో భద్రతపై అవగాహన కల్పించే విధంగా కరపత్రాలు ముద్రించి ఇవ్వాలని నిర్ణయించారు. ఫింగర్ ప్రింట్ స్కానర్ ఏర్పాటు చేసి, వసతి సముదాయాల్లో పనిచేసే సిబ్బందితో పాటు నాలుగవ తరగతి ఉద్యోగుల ఫింగర్ ప్రింట్‌లు తీయాలని అభిప్రాయపడ్డారు.

స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రను పటిష్టంగా అమలు చేయాలి

తిరుపతి(కలెక్టరేట్), మే 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాలని డీర్వో నరసింహులు తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిస రాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యాలయాల్లో రికార్డులు, ఫైళ్లను భద్రపరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేందర్‌రెడ్డి, రోజ్మండ్, కలెక్టరేట్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ముఖ్యం

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ముఖ్యమని ఎస్పీ హర్షవర్ధనరాజు తెలిపారు. ప్రతి నెలా మూడవ శనివా రం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా తిరుపతి రిజర్వు పోలీసు గ్రౌండులో శనివారం రిజర్వు పోలీసులు, శాంతి భద్రతల పోలీసులు కలసి పరిసరాలు శుభ్రం చేశారు. వేసవి కావడంతో పక్షులు మంచినీరు, ఆహారం కోసం ఇబ్బందులు పడకుండా ఉండడానికి చిన్న మట్టి పాత్రల్లో నీరు పోసి వుంచారు.

వ్యాయామంతో రక్తపోటును అదుపుచేయొచ్చు


రక్తపోటుపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వనజాక్షమ్మ

తిరుపతి(వైద్యం), మే 17(ఆంధ్రజ్యోతి): ప్రతిరోజూ ఉదయం 20 నిముషాలు వ్యాయామం చేయడం వలన రక్తపోటును అదుపులో ఉంచుకోవచ్చని లేకపోతే గుండె పోటు, పక్షవాతం వంటి వాటికి గురి కావాల్సి వస్తుందని కార్డియాలజీ సీనియర్ ప్రొఫెసర్ వనజాక్షమ్మ పేర్కొన్నారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా స్విమ్స్‌లో శనివారం కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ రాజశేఖర్ ఆదేశాల మేరకు రక్తపోటుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పండ్లు, కూరగాయలు వంటి సమతుల్య ఆహారం తీసుకోవడం వలన రక్తపోటు తగ్గుందన్నారు. ఈ కార్యక్రమంలో గుండె వైద్యులు హరీష్‌చౌదరి, ఉషారాణి పాల్గొన్నారు.

స్కేటింగ్‌పై ఆసక్తి. సాధన చేద్దామంటే ట్రాక్ లేదు. అయితేనేం పట్టుదలతో కసరత్తు చేసింది. రోడ్డే ట్రాక్‌గా చేసుకుంది. గాయాల పాలైనా వెనుకంజ వేయలేదు. ఇటీవల జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో బంగారు పతకాన్ని సాధించిన కస్పరాజు స్నేహకృతి క్రీడా నేపథ్యమిది.

- తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి





సాధించిన పతకాలతో స్నేహకృతి

కాళ్లకు చక్రాలు కట్టుకుని...!

- జాతీయ స్థాయి స్కేటింగ్‌లో బంగారు పతక విజేత స్నేహ కృతి

ఇంటిల్లిపాదీ క్రీడలు ఆడే కుటుంబం నుంచి వచ్చింది కస్పరాజు స్నేహ కృతి. ఇటీవల ఢిల్లీలో జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో 500 మీటర్ల పోటీల్లో బంగారు పతకంతో మెరిసింది. తిరుపతి రూరల్ పేరూరు సమీపాన నివాసం. తల్లి ప్రొఫెసర్ అఖిల స్వతంత్ర ఎస్వీ యూనివర్సిటీ కెమికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి. తండ్రి వంశీకృష్ణ న్యాయవాది. అక్క ఆశ్రిత తిరుపతి శ్రీనివాసా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో స్విమ్మింగ్‌కు వెళ్లేవారు. అక్కతో పాటు స్నేహకృతి కూడా వెళుతూ స్కేటింగ్ పట్ల మక్కువ పెంచుకుంది. తల్లికి షటిల్, టెన్నికాయిట్, చెస్, క్యారమ్స్‌లో ప్రావీణ్యముంది. తండ్రి వంశీకృష్ణ కబడ్డీలో నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. స్కేటింగ్ ట్రాక్ లేకున్నా రోజూ ప్రకాశం పార్క్‌కు వెళ్లి రెండు పూటలా ప్రాక్టీస్ చేసేది. ఒక్కోసారి ఐదు గంటల వరకూ ప్రాక్టీస్ చేసిన సందర్భాలున్నాయి. జిల్లా స్కేటింగ్ అసోసియేషన్ కార్యదర్శి బాబ్జీ, కోచ్‌లు ప్రసాద్, శశి కిరణ్, పవన్ కల్యాణ్ వద్ద మెలకువలు నేర్చుకుంది. పదేళ్ల నిరంతర కఠోర సాధన ఫలితమే తాజాగా జాతీయ స్థాయిలో స్వర్ణ పతకమంటోంది స్నేహకృతి. కాకినాడ స్కేటింగ్ పోటీల్లో 500 మీటర్లు, వెయ్యి మీటర్ల పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించింది. 2019లో జాతీయ స్థాయిలో సిల్వర్, బ్రాంజ్ మెడల్స్‌ను పొందింది. స్నేహకృతి తిరుపతిలోని నారాయణ విద్యాసంస్థల్లో ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరం పూర్తి చేసింది. ఇంటర్‌లో 470కి గాను 456 మార్కులు సాధించింది. పదవ తరగతిలో 600కు 587 మార్కులు పొందింది.



తల్లిదండ్రులతో స్నేహకృతి

ట్రాక్ ఏర్పాటు చేయాలి

తిరుపతిలో కనీసం 200 మీటర్లతో స్కేటింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తే ఎందరో రాణిస్తారు. నేను రోడ్లపైనే ప్రాక్టీస్ చేస్తూ అనేక సార్లు గాయపడ్డాను. అనుకూల వాతావరణం కల్పిస్తే ఎక్కువ మంది ఎదుగుతారు. 2019లో జాతీయ స్థాయిలో రాణించిన సందర్భంగా అప్పటి ప్రభుత్వం రూ.10 లక్షల నగదు ప్రోత్సాహక బహుమతి ప్రకటించినా అందలేదు. జాతీయ స్థాయిలో సిల్వర్ మెడల్‌కు రూ.75 వేలు, రజిత పతకానికి రూ.50 వేలు ప్రకటించి ఇవ్వలేదు. ఇలాంటివి అందిస్తే ప్రోత్సాహకరంగా ఉంటుంది.

- స్నేహ కృతి



ఘట్టమనేని ఆదిశేషగిరిరావు

తిరుమలలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో సినీ నిర్మాత ఘట్టమనేని ఆదిశేషగిరిరావు, నటి హరితేజ, సీఎం చంద్రబాబు సోదరి హైమావతమ్మ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



హరితేజ


సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్ 2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 7 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ ఏటీజీహెచ్ వరకు వ్యాపించింది. ఇక వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.2.56 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,970

తలనీలాలు సమర్పించినవారు: 33,871



శ్రుతిమించిన ఇసుకాసురుల ఆగడాలు

- పొర్లుకట్టను సైతం తొలిచేసిన వైనం
- ఆ మట్టితోనే నది గర్భంలోకి రోడ్డు ఏర్పాటు

పెళ్లకూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇసుక మాఫియా ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. తాజాగా కప్పగుంట కండ్రిగ వద్ద పొర్లుకట్టను సైతం తవ్వేశారు. ఆ మట్టితోనే ఇసుక తరలింపు కోసం నది గర్భంలోకి ప్రత్యేక రోడ్డును నిర్మించారు. రోజూ రాత్రి ట్రాక్టర్లతో మేనకూరులోని ప్రైవేట్ కంపెనీలకు యథేచ్ఛగా ఇసుకను తరలించేస్తున్నారు. వాహనాల రాకపోకలతో స్వర్ణముఖి నది చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హడలిపోతున్నారు. అంతంత మాత్రంగా ఉన్న రోడ్లు పూర్తిగా ధ్వంసమైపోతున్నాయి.

● ఆందోళనలో రైతాంగం

స్వర్ణముఖి నది పరివాహక ప్రాంతం నుంచి ఇసుకను తవ్వేస్తుండడంతో సాగు, తాగునీటికి కష్టాలు తప్పవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వందలాది వాహనాలతో ఇసుకను తరలించేస్తుండడంతో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయని వాపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇసుక మాఫియాను కట్టడి చేయాలి

జీలపాటూరు రెవెన్యూ పరిధిలోని స్వర్ణముఖినది సమీపంలో కప్పగుంటకండ్రిగ కాజ్‌వే నుంచి గత వైసీపీ హయాంలో భారీ యంత్రాలతో విచ్చలవిడిగా ఇసుక తోడేశారు. అప్పట్లో హైకోర్టులో పిటిషన్ వేసి ఇసుక తరలింపును అడ్డుకున్నాం. భూగర్భ జలాలను పెంచుతూ అదే ప్రాంతంలో చెక్‌డ్యాం నిర్మాంచాలని 2014 టీడీపీ ప్రభుత్వంలోనే ప్రతిపాదనలు పంపాం. ఈ ప్రాంతంలో చెక్‌డ్యాం నిర్మిస్తే అనేక గ్రామాల ప్రజలకు తాగు, సాగు నీరు అందుతుంది. కూటమి ప్రభుత్వం కూడా సానుకూలంగా ఉంది. అయితే ఇసుక మాఫియా అరాచకాలతో స్వర్ణముఖికి గర్భశోకం తప్పేలాలేదు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే విజయశ్రీతో పాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

- శివకుమార్, సర్పంచు, జీలపాటూరు



కప్పగుంటకండ్రిగ సమీపంలో పొర్లుకట్టను తొలిచిన అక్రమార్కులు - (ఇన్‌సెట్‌లో) నదిలో ఏర్పాటు చేసిన రోడ్డు

కవి గొల్లాపిన్ని కన్నుమూత

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 17 (ఆంధ్రజ్యోతి): కవి గొల్లాపిన్ని సుబ్రమణ్యశర్మ (79) కన్నుమూశారు.చిత్తూరు జిల్లా సదుం ఈయన స్వగ్రామం.తిరుపతిలోని కొర్లగుంటలో నివాసముంటోన్న ఈయన శనివారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతి చెందారు. ఆర్టీసీలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేసి 2010లో రిటైరయ్యారు. కవితాసుమాలు, పువ్వులు నవ్వులు, బాలలతాత, పక్షులం, విజయానికి ముప్పై రహస్యాలు, కల్హాపూర్ మహాలక్ష్మి చరిత్ర వంటి పుస్తకాలు వెలువరించారు. తిరుపతిలో జరిగే కవి సమ్మేళనాల్లో స్వీయ కవితలను లయాత్మకంగా చదివేవారు. గొల్లాపిన్నికి భార్య ఉషాకిరణ్, కుమార్తె సౌజన్య (అమెరికా), తనయుడు కిషోర్‌కుమార్ (బెంగళూరు) లో ఉన్నారు.సుబ్రమణ్యశర్మ అంత్యక్రియలు సోమవారం ఉదయం 10 గంటలకు ఆయన అత్తగారి ఊరైన అన్నమయ్య జిల్లా పీలేరు సమీపంలోని దొడ్డిపల్లె పంచాయతీ శివరామపురంలో నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. కవి గొల్లాపిన్ని మృతి పట్ల తిరుపతి జిల్లా రచయితల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సాకం నాగరాజ, మన్నవ గంగాధరప్రసాద్, సాహిత్యవేత్తలు ఆముదాల మురళి, శైలకుమార్, కృష్ణవేణి, యువశ్రీ మురళి, నాదెండ్ల శ్రీమన్నారాయణ, పేరూరు బాలసుబ్రమణ్యం, సింగార బాలమురళీకృష్ణ సంతాపం తెలిపారు. గొల్లాపిన్ని మృతి జిల్లా సాహిత్య రంగానికి తీరని లోటని వారు పేర్కొన్నారు.



సుబ్రమణ్యశర్మ (ఫైల్ ఫొటో)

ఆలయాల్లో ధూపదీప నైవేద్యాలకు ప్రణాళికలు: ఈవో

తిరుమల, మే17(ఆంధ్రజ్యోతి): శ్రీవాణి ట్రస్టు ద్వారా ఇప్పటికే సమరసత సేవా ఫౌండేషన్, దేవదాయ శాఖ సహకారంతో నిర్మిస్తున్న ఆలయాల తీరుతెన్నులపై నివేదిక తయారు చేయాలని టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో ఈవో శనివారం అధికారులతో ఈ ఆలయాలపై సమీక్షించారు. ఈవో మాట్లాడుతూ.. శ్రీవాణి ట్రస్టు నిబంధనలను పునఃసమీక్షించుకుని మరింత మెరుగ్గా, సులభతరంగా, పారదర్శకంగా ఉండేలా తయారు చేయాలన్నారు. సనాతన ధర్మాన్ని మరింత విస్తృతంగా జనబాహుళ్యంలోకి తీసుకెళ్లేందుకు ఆలయాల నిర్మాణాలు పునాదుల్లాంటివన్నారు. ఆలయాల నిర్మాణాలతో దైవచింతన, ఆధ్యాత్మిక, సేవాభావం సమభావంతో మానవ సంబంధాలు పెరుగుతాయన్నారు. నిరాదరణకు గురైన ఆలయాల్లో ధూపదీప నైవేద్యాల నిర్వహణకు పక్కాగా ప్రణాళికలు, వెనుకబడిన ప్రాంతాల్లో నిర్మించిన ఆలయాల నిర్వహణ కోసం ప్రత్యేకంగా యంత్రాంగాన్ని రూపొందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, సీఈ టీవీ సత్యనారాయణ, ఎఫ్ఏసీఏవో బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



వీడిన యువకుడి మర్డర్ మిస్టరీ

శ్రీకాళహస్తి, మే 17(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి హత్య మిస్టరీ వీడింది. ముక్కంటి ఆలయ సమీపంలోని నీలకంఠేశ్వరస్వామి గుడి మార్గంలో ఉన్న శ్మశానంలో ఐదు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తి హత్యకు గురైన విషయం తెలిసిందే. దీనిపై ఆంధ్రజ్యోతి ఈనెల 16న 'ఏం జరుగుతోంది' అన్న శీర్షికతో కథనం ప్రచురించింది. స్పందించిన ఎస్పీ హర్షవర్ధనరాజు కేసును త్వరితగతిన ఛేదించాలని శ్రీకాళహస్తి పోలీసు అధికారులను ఆదేశించారు. శ్రీకాళహస్తి 1వ పట్టణ సీఐ గోపి సిబ్బందితో కలిసి ముక్కంటి ఆలయ పరిసరాల్లో సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. మృతుడిది పాండిచ్చేరిగా గుర్తించారు. శ్రీకాళహస్తి పట్టణం దర్గామిట్టకు చెందిన కొందరు యువకులు అతన్ని హతమార్చినట్లు ఆధారాలతో సహా నిర్ధారించారు. నిందితుల కోసం గాలిస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



కేంద్ర మంత్రికి స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు, అధికారులు

తిరుపతి(ఆటోనగర్) మే17(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద జోషి తెలియజేశారు. తిరుమల పర్యటన నిమిత్తం కేంద్రమంత్రి శనివారం ఉదయం తిరుపతి రైల్వే స్టేషన్‌కు హరిప్రియ ఎక్స్‌ప్రెస్‌లో చేరుకున్నారు. స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, బీజేపీ, జనసేన నాయకులు పుష్పగుచ్ఛాలతో ఆయనకు స్వాగతం పలికారు. రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. స్వాగతం పలికిన వారిలో బీజేపీ నాయకులు సామంచి శ్రీనావాసులు, గుండాల గోపీనాథ్‌రెడ్డి, టి.సుబ్రమణ్యంరెడ్డి, రాజశేఖరరెడ్డి, రెడ్డిబాబు, ఎం.రవిప్రసాద్, డాక్టర్ నరేష్, జనసేన నాయకులు పసుపులేటి హరిప్రసాద్, కిరణ్‌రాయల్, ఆర్కాట్ క్రిష్ణప్రసాద్, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో దేవెగౌడ



తిరుమల, మే 17(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం రాత్రి మాజీ ప్రధాని దేవెగౌడ, కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి నైవేద్య విరామ సమయంలో వేర్వేరుగా ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు.వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు. స్టేట్ లెవల్ కాన్సులేటివ్ కమిటీ ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సభ్యులు చెరుకూరి వెంకటేశ్వరప్రసాద్ కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషిని మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుమలలో శ్రీకృష్ణ అతిథిగృహంలో కలిసి వివిధ అంశాలపై చర్చించారు. ఏపీ అభివృద్ధికి సహకారం అందించాలని ప్రహ్లాద్‌జోషిని కోరారు. కాగా తొలుత కేంద్రమంత్రి తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని దర్శించుకన్నారు. ఆయనతోపాటు టీటీడీ సభ్యుడు భానుప్రకాష్ కూడా ఉన్నారు.

కల్యాణ వెంకన్న వసంతోత్సవాలు ప్రారంభం



చంద్రగిరి, మే 17(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక వసంతోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం స్వామివారిని వసంత మండపానికి వేంచేపు చేసి ఆస్థానం నిర్వహించారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు స్నపన తిరుమంజనం వేడుకగా జరిగింది. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనాలతో అభిషేకం చేశారు. సాయంత్రం ఊంజల్ సేవ అనంతరం 6 నుంచి 7 గంటల వరకు స్వామి అమ్మవార్ల ఉత్సవర్లను విశేషంగా అలంకరించి తిరుచ్చిపై మాడ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, అర్చకులు బాలాజీరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, పార్థసారథి, నారాయణాచార్యులు, సూపరింటెండెంట్లు రమేష్‌కుమార్, రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు, భక్తులు పాల్గొన్నారు. కాగా ఆదివారం సాయంత్రం స్వర్ణరథోత్సవం జరగనుంది. వసంతోత్సవాలు సందర్భంగా ఆలయంలో ఆర్జిత, కల్యాణోత్సవం సేవలను టీటీడీ రద్దు చేసింది.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 933 మంది గైర్హాజరు

తిరుపతి(విద్య), మే 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం జరిగిన ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సప్లిమెంటరీ పరీక్షలకు 933 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ప్రథమ సంవత్సరం పరీక్షలకు 11,196 మంది దరఖాస్తు చేసుకోగా 10,356 మంది పరీక్షలు రాశారు. 840 మంది గైర్హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 1,473 మంది దరఖాస్తు చేసుకోగా 1,380 మంది పరీక్షలు రాశారు. 93 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ ఘటనలు చోటుచేసుకోలేదని ఆర్ఐఓ జీవీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

తుడా కార్యదర్శి బాధ్యతల స్వీకరణ



తిరుపతి, మే17(ఆంధ్రజ్యోతి) : తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) కార్యదర్శిగా డాక్టర్ ఎస్వీ శ్రీకాంత్ బాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాళహస్తి ప్రాంతీయ పశువుల ఆస్పత్రిలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనను తుడా సెక్రటరీగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు ఇచ్చిన విషయం తెలిసిందే. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా, ఎమ్మెల్యేలు, నూతన చైర్మన్, వీసీల సమన్వయంతో తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ బలోపేతానికి కృషి చేస్తానని ఈసందర్భంగా ఆయన చెప్పారు.

అతిథిగృహాల ఆచూకీకి అగచాట్లు

- రసీదుల్లో కొనసాగుతున్న పాతపేర్లు



పాండవ గెస్ట్‌హౌస్ అని ముద్రించిన రసీదు

తిరుమల, మే17(ఆంధ్రజ్యోతి): తిరుమలలో అతిథిగృహాల ఆచూకీ గుర్తించేందుకు భక్తులు అగచాట్లు పడుతున్నారు. ఇటీవల అతిథిగృహాలపై పేర్లు మార్చినా గదుల కేటాయింపు రసీదుల్లో పాతపేర్లనే ప్రింట్ చేసి ఇస్తుండటంతో తికమక పడుతున్నారు. అతిథిగృహాలకు దాతల సొంత పేర్లు కాకుండా పవిత్ర ఆధ్యాత్మిక పేర్లు మాత్రమే ఉండాలని ఇటీవల ధర్మకర్తల మండలి తీర్మానించింది. ఈ క్రమంలో 45 అతిథిగృహాలకు పేర్లు మార్చాల్సిన అవసరముందని అధికారులు గుర్తించారు. ఇప్పటికే కొన్నింటి పేర్లను మార్చారు. కొత్త బోర్డులను ఏర్పాటు చేశారు. సిఫార్సు లేఖలను పద్మావతి విచారణ కార్యాలయంలో పరిశీలించి గదులను కేటాయిస్తారు. అయితే గదుల వివరాలతో ఇచ్చే రసీదులో పాతపేర్లే ఉంటున్నాయి. తీరా అక్కడకు వెళితే కొత్త పేరుతో ఉన్న బోర్డులను చూసి భక్తులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో తిరిగి పద్మావతీ విచారణ కార్యాలయానికి రావడం లేదా సమీపంలో ఉండే వ్యక్తులను గెస్ట్‌హౌస్ వివరాలను చెప్పి అడగడం వంటివి చేస్తున్నారు. గెస్ట్‌హౌస్‌లపై పేర్లు మార్చిన అధికారులు రసీదుల్లో మార్చేలా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.



పాండవ గెస్ట్‌హౌస్‌పై 'విరజా నిలయం' బోర్డు

శేషాచలంలో అనధికార ట్రెక్కింగ్ నేరం

- ఫారెస్టు రేంజర్ వెంకటరమణ



భాకరాపేట, మే 17(ఆంధ్రజ్యోతి): శేషాచలం అడవుల్లో అనుమతి లేకుండా ట్రెక్కింగ్ చేయడం చట్టరీత్యా నేరమని ఫారెస్టు రేంజర్ వెంకటరమణ స్పష్టం చేశారు. శనివారం భాకరాపేట ఫారెస్టు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. భాకరాపేట రేంజ్ అటవీ ప్రాంతంలో వెంకటేశ్వర అభయారణ్యం, వెంకటేశ్వర జాతీయ ఉద్యానవనం చేర్చారన్నారు. వన మూలికలకు, పక్షి, వృక్ష జాతులకు, ప్రకృతి సహజ సౌందర్యానికి ఈ ప్రాంతం కేంద్రంగా ఉందన్నారు. ఇక్కడి విశేషాలను సోషల్ మీడియాలో పెడుతూ ప్రకృతి ప్రేమికులను మోసం చేస్తూ కొందరు నగదు వసూలు చేస్తున్నారన్నారు. ఇది చట్టవిరుద్ధమన్నారు. శేషాచలం అటవీ ప్రాంతంలోకి ఎవరికీ అనుమతి లేదన్నారు. ట్రెక్కింగ్ చేయడం శిక్షార్హమన్నారు. ఇప్పటికే తొమ్మిది ట్రెక్కింగ్ సంస్థలను గుర్తించి డీఎఫ్‌వో ఆధ్వర్యంలో విచారిస్తున్నారన్నారు. అనధికారికంగా ట్రెక్కింగ్ చేసి ఫొటోలు, వీడియోలు పెట్టిన మహేశ్ బాబు అనే వ్యక్తిపై కేసు నమోదు చేశాన్నారు.

నేడు జేఈఈ అడ్వాన్స్డ్ పరీక్ష

తిరుపతి(విద్య), మే 17(ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రతిష్ఠాత్మక ఐఐటీల్లో బీటెక్, బీఎస్, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో ప్రవేశానికిగాను జాతీయ స్థాయిలో నిర్వహించే జేఈఈ అడ్వాన్స్డ్ పరీక్ష ఆదివారం నిర్వహించనున్నారు. ఇందుకుగాను మూడు కేంద్రాలు ఏర్పాటు చేశారు. తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీరామ ఇంజినీరింగ్, తిరుపతి-రేణిగుంట మార్గంలోని చదలవాడ రమణమ్మ ఇంజినీరింగ్ కళాశాల, గూడూరు ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-2 పరీక్షలు జరుగుతాయి. ఉదయం 7 గంటల నుంచే అభ్యర్థులను పరీక్ష హాల్‌లోకి అనుమతిస్తారు. 8.30 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని తిరుపతి కో-ఆర్డినేటర్ దుర్గ వెల్లడించారు. మధ్యాహ్నం 2 గంటలలోపలే పరీక్ష హాల్‌లోకి ప్రవేశించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఎలక్ట్రానిక్ వస్తువులు, ఆభరణాలను అనమతించేది లేదని తెలిపారు.

● పరీక్ష అనంతరం షెడ్యూల్ ఇలా.. : అభ్యర్థుల ఓఎంఆర్ పత్రాలను ఈ నెల 22న వెబ్‌సైట్‌లో ఉంచుతారు. 26న ప్రాథమిక కీ విడుదల చేస్తారు. జూన్ 2వ తేదీ ఉదయం 10 గంటలకు తుది కీ, ఫలితాలు విడుదల చేస్తారు. 3వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి కౌన్సెలింగ్ ప్రారంభమవుతంది.

నేడు సైన్స్ సెంటర్‌లో ఉచిత ప్రవేశం

మంగళం, మే 17(ఆంధ్రజ్యోతి): తిరుపతి సైన్స్ సెంటర్‌లో ఆదివారం అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం నిర్వహించనున్నట్లు ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీనివాస్ నెహ్రూ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సందర్శకులకు ఉచిత ప్రవేశం ఉంటుందని పేర్కొన్నారు. 3డీ షో, డిజిటల్ ప్లానిటోరియం షో, పార్కింగ్‌కు ఫీజు యథావిధిగా ఉంటుందని వివరించారు. మ్యూజియం, విజ్ఞానాన్ని పెంపొందించే స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

1100కు కాల్ చేసి అర్జీ స్థితి తెలుసుకోండి

తిరుపతి(కలెక్టరేట్), మే 17(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో అందజేసిన అర్జీ స్థితి తెలుసుకోవడానికి అర్జీదారులు 1100టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని డీఆర్వో నరసింహులు తెలిపారు. ఏవైనా సందేహాలు ఉంటే అదే నంబర్‌కు ఫోన్‌చేసి అప్లికేషన్ లేదా ఆధార్ లేదా మొబైల్ నంబర్లతో అర్జీ స్థితిని తెలుసుకోవచ్చునని పేర్కొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి


రథోత్సవంలో అశేష జనవాహిని

వైభవంగా కరిమాణిక్యస్వామి రథోత్సవం
గోవిందనామ స్మరణతో మార్మోగిన తుమ్మూరు

నాయుడుపేట టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - తుమ్మూరులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్య స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రథోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం టీటీడీ వేద పండితులు శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను, శ్రీవారిని విశేషంగా అలంకరించి రథంపై అధిష్ఠింప జేశారు. అనంతరం అశేష జనవాహిని మధ్య రథోత్సవం ప్రారంభమైంది. స్వామి, అమ్మవార్లపై భక్తులు మిరియాలు చల్లి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా తుమ్మూరు గోవిందనామస్మరణతో మార్మోగింది. రథోత్సవం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ అంజనేయరాజు, సూపరింటెండెంట్ జ్ఞానప్రకాష్, సీనియర్ అసిస్టెంట్ మహేష్, ఇన్‌స్పెక్టర్లు సుధీర్, హరి, గ్రామస్తులు పసల గంగాప్రసాద్, మోహన్‌రెడ్డి, మురళి, నాగయ్య, శివారెడ్డి, సుదాకర్‌రెడ్డి, రవిస్వామి, గోపీ పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్యస్వామి

ప్రజారోగ్యానికి పెద్దపీట



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు అర్బన్, మే 17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక టవర్‌క్లాక్ కేంద్రం వద్ద పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా బీట్ ద హీట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారానే పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. వేసవిలో జంతువులకు ఆహారం, నీరు అందిస్తూ వాటిని రక్షణ కల్పించాలన్నారు. వేసవిలో ఎండ తీవ్రతకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా స్థానిక సీఎస్ పార్కులో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఎస్పీ గీతాకుమారి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, నాయకులు శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, బిల్లు చంద్రయ్య, అబ్దుల్‌రహీం,పేటేటి చంద్రశేఖర్, పెంచలయ్య, నాయుడు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

భారత జవాన్ల త్యాగాలు అమూల్యం


తిరంగా ర్యాలీలో ఎమ్మెల్యే కురుగొండ్ల, అధికారులు, నాయకులు

వెంకటగిరి, మే 17(ఆంధ్రజ్యోతి): భారత జవాన్ల త్యాగాలు అమూల్యమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయిన నేపథ్యంలో శనివారం వెంకటగిరిలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. కాశీపేట కూడలి నుంచి పాతబస్టాండు వరకు ర్యాలీ కొనసాగింది. భారత్ మాతాకీ జై.. మురళీ నాయక్ అమర్ రహే అంటూ చేసిన నినాదాలు చేశారు. కూటమి నేతలతో పాటు పట్టణ ప్రజలు 9వ బెటాలియన్, పోలీసు, ఎక్సైజ్ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొనడంతో పట్టణంలోని ప్రధాన రోడ్లు కిక్కిరిసిపోయింది.

శ్మశానం ఆక్రమణదారుడిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి
పోలీసుస్టేషన్ ఎదుట గిరిజనుల ఆందోళన


పోలీస్‌స్టేషన్ ఎదుట యానాది సంఘం నాయకులు, గిరిజనుల ఆందోళన

బాలాయపల్లి, మే 17(ఆంధ్రజ్యోతి) మండలంలోని మన్నూరు గ్రామంలోని గిరిజనుల శ్మశాన స్థలాన్ని ఆక్రమించిన జడపల్లి రమణయ్యపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ యానాది సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చెంచు మల్లికార్జున ఆధ్వర్యంలో బాలాయపల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా గిరిజనులు శ్మశానంగా వినియోగిస్తున్న భూమిని ఆక్రమించుకోవడం దుర్మార్గమన్నారు. ప్రశ్నించిన గిరిజనులపై దౌర్జన్యానికి పాల్పడిన రమణయ్యపై అట్రాసిటీ కేసు నమోదు చేసి గిరిజనులకు న్యాయం చేయాలన్నారు. అనంతరం ఎస్ఐ గోపీకి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో యానాది సంక్షేమ సంఘం సభ్యులు వెలుగోటి రేవతి, తిరుపతి రాములమ్మ, పసుపులేటి కల్యాణ, మానికల చిరంజీవి, లక్ష్మయ్య, పెంచలమ్మ, చిన్న అంకయ్య, వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

యాచకుడి మృతి

గూడూరు అర్బన్, 17(ఆంధ్రజ్యోతి): స్థానిక రెండో పట్టణ పరిధిలోని రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం యాచకుడు మృతి చెందాడు. ఎస్ఐ గోపాల్ తెలిపిన మేరకు వివరాలు... కొంతకాలంగా రైల్వేస్టేషన్ సమీపంలో భిక్షాటన చేసుకుని జీవనం సాగిస్తున్న వ్యక్తి శనివారం మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు.మృతుడి కుడి చేతిపై జయలక్ష్మి అని పచ్చబొట్టు ఉందని, వయసుసుమారు 50ఏళ్ల, కాషాయపు రంగు పంచె ధరించి ఉన్నాడని పోలీసులు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

20న జాబ్‌మేళా

గూడూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో ఈనెల 20వ తేదీన డీఆర్‌డబ్ల్యూ, లక్ష్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ హనుమంతరావు కోరారు. శనివారం స్థానిక కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 20న డీఆర్‌డబ్ల్యూ కళాశాల, లక్ష్య ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పలు ప్రముఖ పరిశ్రమల ద్వారా నిర్వహిస్తున్న ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నామన్నారు. ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, పీజీ, బీటెక్ విద్యా అర్హత కలిగిన వారు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గాయత్రి, శ్రీనివాస్, లక్ష్య ఫౌండేషన్ ప్రతినిధి బానుచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలాయపల్లి ఎంపీడీవోగా శ్రీనివాసులు



బాలాయపల్లి, మే 17(ఆంధ్రజ్యోతి) బాలాయపల్లి ఎంపీడీవోగా కె.శ్రీనివాసులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అన్నమయ్య జిల్లా నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఏవో వినీల్ కుమార్ ఇన్‌చార్జిగా వ్యవహరించారు.

హామీలతో సరి!

- దశాబ్దాల కల చెంబేడు మినీ రిజర్వాయర్
- ఏళ్ల తరబడి ప్రతిపాదనలకే పరిమితం
- పద్దెనిమిది గ్రామాల రైతుల్లో ఆవేదన


చెంబేడు చెరువు

పెళ్లకూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంబేడు చెరువులో మినీ రిజర్వాయర్ ఏర్పాటు కలగానే మిగిలిపోయింది. ప్రతి ఎన్నికల సమయంలోనూ అధికారంలోకి వచ్చిన వెంటనే చెంబేడు చెరువును మినీ రిజర్వాయర్‌గా మార్చుతామని నేతలు హామీలు ఇస్తున్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా... 30 ఏళ్లుగా హామీ మాత్రం నెరవేరడంలేదని ఈ ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఉన్న 67 ఇరిగేషన్ చెరువుల్లో అతి పెద్దదైన చెంబేడు చెరువు 833 ఎకరాల్లో విస్తరించి ఉంది. 1962లో దివంగత ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో శ్రీకాళహస్తి వద్ద స్వర్ణముఖినదిలో చెక్‌డ్యాం ఏర్పాటు చేసి, అక్కడ నుంచి కాలువలు తవ్వించి చెంబేడు చెరువుకు సాగునీరందించారు. తదనంతరం దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 7వ బ్రాంచ్ కాలువ తవ్వించి మండలంలోని అనేక చెరువులతో పాటు చెంబేడు చెరువుకు తెలుగుగంగ జలాలను అందించారు. దీంతో సుమారు 15 గ్రామాల్లోని 4 వేల ఎకరాల ఆయకట్టుకు ప్రస్తుతం సాగునీరు అందిస్తోంది. చెంబేడు చెరువును మినీ రిజర్వాయర్‌గా మార్చితే చెన్నప్పనాయుడుపేట, అర్లమాల, అర్లపాడు, నందిమాల, బంగారుపేట, మోదుగులపాలెం, శిరసనంబేడు, పెరుప్పాడు తదితర గ్రామాల ప్రజలకు సాగు, తాగునీరు పుష్కలంగా అందుతుంది. 2016లో ప్రతిపక్ష నేత హోదాలో పాదయాత్ర చేసిన జగన్ చెంబేడు చెరువును మినీ రిజర్వాయర్‌గా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక ప్రజాప్రతినిధులు కూడా హామీలు ఇస్తున్నారే తప్పా కార్యరూపం దాల్చడం లేదు. గతంలో నీటిపారుదలశాఖ అధికారులు రూ. 32కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదిక పంపారు. దానికి ఇప్పటి వరకు మోక్షం లేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువుతో పాటు సాగునీరు అందించే కాలువలు, గేట్లు దెబ్బతిని శిథిలావస్థకు చేరుకున్నాయి. గతంలో వేలాది ఎకరాలకు సాగునీరు అందించిన ఈ చెరువులో పూడిక చేరి, పిచ్చిమొక్కలతో నిండిపోయింది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి చెంబేడు చెరువును మినీ రిజర్వాయర్‌గా మార్చాలని రైతులు కోరుతున్నారు.

టీడీపీ మండల కమిటీల నియామకంపై అభిప్రాయాల సేకరణ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కన పరిశీలకుడు కొండలరావు, నాయకులు శంకరయ్య, మురళీరెడ్డి, పెరుమాళ్ తదితరులు

సూళ్లూరుపేట, మే 17 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గంలో టీడీపీ మండల కమిటీల నియామకానికి శ్రీకారం చుట్టారు. శనివారం స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు కొండలరావు ఆధ్వర్యంలో సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాలకు కమిటీ నియామ కానికి గ్రామస్థాయి నాయకుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. మూడు మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి ఎమ్మెల్యే, పరిశీలకుడి ఎదుట తమ అభిప్రాయాలు వెల్లడించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి మండల అధ్యక్ష, కార్యదర్శి పోస్టులకు అధిక పోటీ నెలకొనడంతో అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి ఐవీఆర్ కాల్స్ ద్వారా అభిప్రాయాన్ని సేకరించనున్నారు. ముందుగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన వారికి సముచిత స్థానం ఉంటుందన్నారు. సమావేశంలో నాయకులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, కామిరెడ్డి మురళీ రెడ్డి, బొమ్మన పవణి, గాడి నారాయణ రెడ్డి, బిట్టేటి పెరుమాళ్, కొమ్మ శంకరయ్య, పాకం వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం: పాశం

గూడూరు అర్బన్, మే 17(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద లబ్ధిదారులకు ఇంటి స్థలం పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం సెంటు స్థలం మాత్రమే ఇచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వంలో మూడు సెంట్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తే, సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ రాష్ట్రానికి పరిశ్రమలను తీసుకువచ్చి నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నా పేదల అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా, తహసీల్దారు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో డిజిటల్ అసిస్టెంట్ మృతి

దక్కిలి, మే 17(ఆంధ్రజ్యోతి): దక్కిలి మండలం డి.వడ్డిపల్లి గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంటు తాటిపర్తి వీరయ్య(38) గుండెపోటుతో మృతి చెందారు. డి.వడ్డిపల్లికి చెందిన వీరయ్య శుక్రవారం విధుల హాజరయ్యారు. తీవ్ర అస్వస్థతకు గురవడంతో దక్కిలి ప్రభుత్వాస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకొని ఇంటికి వెళ్లారు. అదేరోజు రాత్రి గుండెపోటుకు గురై మృతి చెందారు.


కొండుగుంట అటవీ ప్రాంతంలో మృతదేహం లభ్యం

కోట, మే 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొండుగుంట అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసుల కథనం మేరకు... కొండుగుంట అటవీ ప్రాంతంలోని రావి చెట్టు కింద కుళ్లిన మాదిపోయిన ఉన్న మృతదేహాన్ని పశువుల కాపరులు గుర్తించి వీఆర్వోకు తెలిపారు. ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ పవన్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి

తడ, మే 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం ఇచ్చి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీపీ కొలిమి రమణారెడ్డి అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా తడ బజారుపాడులో ఎంపీపీ కొలిమి రమణారెడ్డి ఆధ్వర్యంలో పారిశుధ్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేఖర్‌నాయక్, ఎంఈవో మల్లికార్జున, సర్పంచులు ఆర్మూగం, జయప్రద, పంచాయతీ కార్యదర్శులు గాబ్రియల్, మస్తాన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎండ నుంచి రక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలి


రైల్వేగేటు వద్ద ఏర్పాటు చేసిన గ్రీన్‌మ్యాట్

సూళ్లూరుపేట, మే 17(ఆంధ్రజ్యోతి): వేసవిలో ఎండల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కె.చిన్నయ్య అన్నారు. శనివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా బీట్ ద హీట్ కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ కూడళ్లలో ఎండ తీవ్రత నుంచి ప్రజలకు రక్షణ కల్పించేందుకు గ్రీన్ నెట్లు ఏర్పాటు చేశారు. అలాగే ఇంటింటికి వెళ్లి వేసవి తాపాన్ని తట్టుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.2 కోట్లతో పోలిశెట్టిగుంట అభివృద్ధి

వెంకటగిరి, మే 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోలిశెట్టిగుంటను రూ2 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. శనివారం పట్టణంలోని పోలిశెట్టిగుంట అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ పూజలు నిర్వహించి పనులు ప్రారంభించారు. అంతకుముందు స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం చేపట్టారు. ప్రజలచే ప్రతిజ్ఞ చేయించారు.

సంపద తయారీ కేంద్రం పరిశీలన


సేంద్రియ ఎరువును పరిశీలిస్తున్న ఎంపీడీవో కోటేశ్వరరావు

వెంకటగిరిటౌన్, మే 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కలపాడు గ్రామంలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఎంపీడీవో కోటేశ్వరరావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. ప్రభుత్వం అందించే పథకాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. అనంతరం మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన టెన్త్ సప్లిమెంటరీ ప్రశ్నపత్రాలు

కోట, మే 17 (ఆంధ్రజ్యోతి): టెన్త్ సప్లిమెంటరీ ప్రశ్నపత్రాలు కోట పోలీస్‌స్టేషన్‌కు చేరాయి. ఈ నెల 19నుంచి 28వ తేదీ వరకు కోట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయి.

రూ.రెండు లక్షల అల్యూమినియం చోరీ
ముగ్గురిపై కేసు

నాయుడుపేట టౌన్, మే 17(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - మేనకూరు సెజ్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో రూ2 లక్షల విలువచేసే అల్యూమినియం చోరీ జరిగినట్లు ఆ కంపెనీ మేనేజర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు మండలంలోని అరవపేరిమిడి గ్రామానికి చెందిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

కల్వర్టును బాగు చేయండి


కల్వర్టు వద్ద నిలిచిపోయిన వాహనాలు

చిల్లకూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోమిడి గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన్న కల్వర్టు మరమ్మతులు సక్రమంగా చేపట్టకపోవడంతో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ వాహనదారులు శనివారం కల్వర్టు వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ మోమిడి గ్రామ సమీపంలో ఉన్న కల్వర్టుకు మరమ్మతులు సక్రమంగా చేయకపోవడంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నామన్నారు. కల్వర్టు వద్ద ఉన్న రోడ్డు పూర్తిగా గుంతలతో నిండిపోయి ఉందని, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. అధికారులు స్పందించి కల్వర్టు, రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పరిసరాల శుభ్రతపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న చెన్నూరు పీహెచ్‌సీ సిబ్బంది

గూడూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర, హైపర్ టెన్షన్ కార్యక్రమంలో భాగంగా పరిసరాల శుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ సిబ్బంది మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలతో పాటు వ్యక్తిగత శుభ్రతను పాటిస్తే ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో నాగేశ్వరరెడ్డి, మస్తానయ్య సిబ్బంది పాల్గొన్నారు.

కోట: మండల పరిధిలోని 21 పంచాయతీల్లో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు జరిగాయి. ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్, ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

దక్కిలి: స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం తహసీల్దార్ శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది కార్యాలయ పరిసరాల్లో చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో జగదీష్ బాబు పాల్గొన్నారు.

పుష్కర కుంభాభిషేకం



వెంకటగిరి టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి పుష్కర కుంభాభిషేక మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి గోపూజ, ధనపూజ, కలశస్థాపన, సకలదేవతా ఆహ్వానం, మూల మంత్రం, నవగ్రహ జపాలు, చండీ నవార్ణవ సప్తశతి పారాయణం, లఘు పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని బంగారు చీర, కిరీటంతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

పుత్తూరు వార్తలు

ఉత్సాహంగా తిరంగా ర్యాలీ



ర్యాలీలో ఎమ్మెల్యేతో పాటు కూటమి నేతలు, ప్రజలు

పుత్తూరు అర్బన్, మే17(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతంలో సైనికులకు సంఘీభావం తెలుపుతూ ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆధ్వర్యంలో పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాను చేతబట్టి భారత్ మాతాకీ జై, వందేమాతరం నినాదాలతో హోరెత్తించారు. ఎంఎన్‌ఎం పెట్రోలు బంకు నుంచి అంబేడ్కర్ కూడలి వరకు తిరంగా ర్యాలీ అద్భుతంగా ఉత్సాహంగా సాగింది. మహిళా మోర్చా జాతీయ కార్యదర్శి సుభాషిణి నిషిధరాజు ఆధ్వర్యంలో కార్యకర్తలు ఆర్‌డీ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు.

జోరుగా స్వచ్ఛాంధ్ర

పుత్తూరు అర్బన్, మే 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని అధికారులు ఉత్సాహంగా నిర్వహించారు. శనివారం బీట్ ది హీట్ అంశంతో కార్యక్రమాలను మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ మున్సిపల్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయాన్ని, పరిసరాలను శుభ్రపరుచుకున్నారు. ఆవరణలో మొక్కలునాటారు. పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పారిశుధ్య కార్మికులు, వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

పాము కాటుతో మహిళ మృతి

పుత్తూరు అర్బన్, మే17(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని వెల్లోపల్లికి చెందిన కావ్య పాము కాటుతో మృతి చెందారు. ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆమె టీడీపీ కార్యకర్త కావడంతో పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి దనపాల్ తదితరులు ఉన్నారు.

మిద్దెలపై మొక్కలు పెంచండి

పుత్తూరు,మే17(ఆంధ్రజ్యోతి): వాతావరణంలో క్రమంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలను తగ్గించేందుకు ప్రతి విద్యార్థి ఉద్యమంలా ఇంటి పరిసరాల్లో, మిద్దెల పైనా మొక్కలను నాటి సంరక్షించాలని విశ్రాంత వైద్యాధికారి రవిరాజు కోరారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం బీట్ ద హీట్ చర్చను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మిద్దె మీద కూడా చిన్నపాటి మొక్కలను పెంచాలని సూచించారు. ప్రిన్సిపాల్ చంద్రమౌళి, అధ్యాపకులు శ్రీనివాసులు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం

వడమాలపేట, మే 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయగుంటలో కొలువై ఉన్న ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీవారి గ్రామోత్సవం, ఊం జల సేవలను వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారులతో శ్రీవారిని వివిధ రకాల పూలమాలలతో అలంకరించి ఊయలలో అధిష్ఠింపజేసి వేదమంత్రాలు, భక్తుల గోవిందనామ స్మరణల నడుమ ఉంజల్ సేవ నిర్వహించారు. అనంతరం పద్మావతి, ఆండాళ్ సమేతయ వెంకన్నను మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించారు. అనంతరం ఆలయానికి చేరుకున్న స్వామిఅమ్మవార్లకు మంగళ హారతులిచ్చారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు, ఆలయ అధికారి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరానికి స్పందన

వడమాలపేట, మే 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలో భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఆయుర్వేద వైద్య శిబిరం విజయవంతమైంది. సుమారు వంద మందిని వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సీతారామపురం ఆయుష్ ఆస్పత్రి ఆయుర్వేద వైద్యాధికారి విజయ చంద్రిక మాట్లాడుతూ.. దీర్ఘ కాలిక రుగ్మతల కోసం ఆయుష్ ఆస్పత్రిలో మందులు అందుబాటులో ఉంటాయన్నారు. వైద్యులు కృష్ణయ్య, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో రక్షణమంత్రి సాంకేతిక సలహాదారు



ఆలయ ధ్వజస్తంభం వద్ద సతీష్‌రెడ్డి, ఈవో తదితరులు

శ్రీకాళహస్తి, మే 17 (ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం భారత రక్షణ మంత్రి సాంకేతిక సలహాదారు, డీఆర్‌డీవో మాజీ చైర్మన్ సతీష్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఈవో బాపిరెడ్డి వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అంద జేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు కృష్ణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, హరియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ క్రికెట్ టీం కోచ్ గౌతం గంభీర్‌కు సాదర స్వాగతం



రేణిగుంట, మే 17 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ క్రికెట్ టీం కోచ్ గౌతమ్ గంభీర్‌కు తిరుపతి విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. శ్రీవారి దర్శనార్థం శనివారం న్యూఢిల్లీ నుంచి ఎయిర్ అలయన్స్ విమానంలో మధ్యాహ్నం తిరుపతి విమానాశ్రయం చేరుకున్నారు. ఆయనకు విమానాశ్రయ అధికారులు, అభిమానులు సాదర స్వాగతం పలికారు. విమానాశ్రయం వెలుపల గౌతమ్ గంభీర్‌ను మాట్లాడించేందుకు మీడియా ప్రయత్నించగా ఆయన సున్నితంగా తిరస్కరించారు. రోడ్డు మార్గాన తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం

వైసీపీకి టీడీపీ సవాల్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

సత్యవేడు, మే 17 (ఆంధ్రజ్యోతి): సత్యవేడులో అభివృద్ధిపై దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి నూకతోటి రాజేష్‌కు టీడీపీ కో-ఆర్డినేటర్ శ్రీపతిబాబు, పార్టీ అబ్జర్వర్ చంద్రశేఖర్ నాయుడు సవాల్ విసిరారు. మంత్రి లోకేశ్‌ను విమర్శిస్తూ రాజేష్ ఇటీవల వైసీపీ అనుకూల మీడియాలో ఇంటర్వ్యూపై వారు సంయుక్తంగా ఖండించారు. శనివారం సత్యవేడులో టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ రెడ్డి నివాసగృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శ్రీపతిబాబు మాట్లాడుతూ... సత్యవేడును ఎవరు అభివృద్ధి చేశారో నియోజకవర్గ ప్రజలను అడిగితే తెలుస్తుందన్నారు. 2020లో భూమి పూజ చేసిన నాగలాపురం - చిన్నపాండూరు రోడ్డు పనులను ఎందుకు చేపట్టలేదో రాజేష్ సమాధానం చెప్పాలన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ఉపాధి హామీ పథకం కింద రూ.25 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. చంద్రశేఖర్ నాయుడు మాట్లాడుతూ... మంత్రి లోకేశ్‌ను విమర్శించే ముందు ఆత్మవిమర్శ చేసుకోవాలని రాజేష్‌కు సూచించారు. ఎవరో రాసిచ్చిన స్క్రిప్టును చదవడం మానాలని హితవు పలికారు. ప్రవీణ్‌కుమార్ రెడ్డి, సతీష్‌నాయుడు, పద్మనాభ రాజు, తిరుమలైరెడ్డి, ఎండీ కుమార్, గిరి, హేమభూషణం, షణ్ముగం, రాధయ్య, శివానందం, కృష్ణచైతన్య, సురేంద్రరెడ్డి తదితరలు పాల్గొన్నారు.

సెక్యూరిటీ వ్యవస్థ అప్రమత్తంగా ఉండాలి



సెక్యూరిటీ సిబ్బందికి సూచనలిస్తున్న డీఎస్పీ

శ్రీకాళహస్తి, మే 17(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయ సెక్యూరిటీ వ్యవస్థ మరింత కట్టుదిట్టంగా వ్యవహరించాలని డీఎస్పీ నరసింహమూర్తి సూచించారు. వారం రోజుల క్రితం ముక్కంటి ఆలయ ఆవరణలో సత్యవేడు ప్రాంతానికి చెందిన రాధాకృష్ణ గాయాలతో మృతి చెందిన విషయం తెలిసిందే. దీనిపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. ఆయా అంశాలపై డీఎస్పీ ముక్కంటి ఆలయం వద్ద శనివారం సాయంత్రం సెక్యూరిటీ సిబ్బందితో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రముఖ శైవక్షేత్రమన శ్రీకాళహస్తీశ్వరాలయంలో సెక్యూరిటీ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అనుమానిత వ్యక్తులు తారసపడితే పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఇక విధుల్లో అనుసరించాల్సిన నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. 1టౌన్ సీఐ గోపి తదతరులు పాల్గొన్నారు.

స్నేహితులతో సరదాగా ఈతకెళ్లి యువకుడి మృతి

రేణిగుంట, మే 17 (ఆంధ్రజ్యోతి): స్నేహితులతో సరదాగా ఈతకు వెళ్లి యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం సాయంత్రం మామండూరులో జరిగింది. రేణిగుంట అర్బన్ స్టేషన్ రైటర్ గిరినాయుడు తెలిపిన వివరాలు... స్థానిక జ్యోతినగర్‌కు చెందిన అంటోని(27) విమానాశ్రయంలో లోడర్. శుక్రవారం స్నేహితులతో కలిసి మామండూరులోని మిత్రుడి ఇంటికి వెళ్లారు. అక్కడ నుంచి సమీపంలోని లక్ష్మమ్మ బాయి వద్ద మద్యం తాగారు. అనంతరం సరదాగా బావిలో ఈతకు దిగారు. అదే సమయంలో అంటోని మునిగిపోయాడు. అక్కడే ఉన్న స్థానికులకు, పోలీసులకు స్నేహితులు సమాచారం ఇచ్చారు. అయితే పోలీసులు వచ్చే సమయానికి చీకటి పడింది. దీంతో శనివారం ఉదయం బావిలో ఉన్న మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం రుయా ఆస్పత్రికి తరలించారు.

మురుగు కాలువలో పడి...

రేణిగుంట పారిశ్రామిక వాడలోని మురుగు కాలువలో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుడి వయసు 40- 45 సంవత్సరాల మధ్య ఉంటుందని తెలిపారు. మెడలో స్టీల్ చైన్, కుడి చేతికి స్టీల్ కడియం, బ్లూ రంగు టీ షర్టు, పచ్చ రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు.మృతదేహాన్ని రుయా ఆస్పత్రికి తరలించారు.

స్వచ్ఛత పాటిద్దాం



కేవీబీపురంలో మానవహారం

శ్రీకాళహస్తి, మే 17(ఆంధ్రజ్యోతి): పరిసరాల స్వచ్ఛత పాటిద్దామని శ్రీకాళహస్తి రెండో పట్టణ సీఐ నాగార్జునరెడ్డి పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పోలీసు సిబ్బంది స్టేషన్‌లో, ఆవరణలో పరిసరాలను శుభ్రం చేశారు.

ఏర్పేడు (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని అంజిమేడు పంచాయతీ పోతుమానుగుంట ప్రాథమిక పాఠశాల వద్ద శనివారం కృష్ణాపురం సెక్షన్ ఫారెస్టు అధికారులు పరిసరాలను శుభ్రం చేశారు. పోతుమానుగుంట వనసంరక్షణ సమితి సభ్యులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సికిందర్‌బాబు మాట్లాడుతూ.. అడవుల సంరక్షించుకోవాలని, సామాజిక వనాలను పెంచాలని, అడవులకు నిప్పు పెట్టవద్దని కోరారు. ఎఫ్‌బీవో శోభారాణి పాల్గొన్నారు.

కేవీబీపురం (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని ఎంపీడీవో మాలతి అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని కేవీబీపురంలో నిర్వహించారు. ఇందులో భాగంగా అధికారులు, కార్మికులు మానవహారంగా ఏర్పాటు చేశారు. తహసీల్దారు మునిరత్నంరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజేంద్రబాబు, ఈవోపీఆర్డీ వల్లి, కార్యదర్శి మణికంఠ, సచివాలయ, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ, (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యతని ఎంపీడీవో వెంకటరత్నమ్మ తెలిపారు. బీఎన్‌కండ్రిగలో ఉపాధి హామీ నిధులతో నిర్మించిన పశువుల తొట్టెను ప్రారంభించారు. సర్పంచ్ వెంకటమ్మ, ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం, వెలుగు ఏపీఎం మునెయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని 19 పంచాయతీల్లో సర్పంచులు, కార్యదర్శుల ఆధ్వర్యంలో ర్యాలీలు జరిగాయి. రేణిగుంటలో జరిగిన ర్యాలీలో సర్పంచ్ నగేష్, డీఎస్పీ శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ ప్రభురావు, కార్యదర్శి మణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎస్‌ఐ అరుణ్ కుమార్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

రీ సర్వేలో బండిబాట ఏర్పాటు

శ్రీకాళహస్తి, మే 17(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలంలోని బోనుపల్లిలో రీసర్వేలో భాగంగా గ్రామస్తులు ఇచ్చిన అర్జీ మేరకు బండిబాటకు చర్యలు తీసుకున్నారు. తహసీల్దారు మధుసూదన్‌రావు మాట్లాడుతూ గ్రామస్తుల విన్నపం మేరకు పొలాల మధ్య బండి బాటను సర్వే చేసి ఇచ్చినట్లు తెలిపారు. సర్వేయర్ హరి పాల్గొన్నారు.

సిందూర్‌తో పాక్‌కు గుణపాఠం

ఘనంగా తిరంగా ర్యాలీ



తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి - సత్యవేడులో ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, మే 17(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్ ఉగ్రమూకలకు తగిన గుణపాఠం చెప్పిన భారత సైనికుల శౌర్యాన్ని ఎమ్మెల్యే సుధీర్ కొనియాడారు. శ్రీకాళహస్తి పట్టణంలో శనివారం సాయంత్రం తిరంగా ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ నాలుగు మాడవీధుల్లో సాగింది. ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. భారత్‌మాతాకీ జై నినాదంతో మాడవీధులు మార్మోగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పహల్గాంలో అమాయక ప్రజలను పాక్ ఉగ్రమూకలు పొట్టన పెట్టుకున్నాయన్నారు. ఉగ్రమూకలను పాకిస్థాన్ పెంచి పోషిస్తోందని చెప్పారు. భారత్ జోలికి వస్తే ఏం జరుగుతుందో ఆపరేషన్ సిందూర్‌తో ప్రపంచానికి తెలిసిందన్నారు. సైన్యానికి ఎలాంటి నష్టం జరగకుండా అత్యంత చాకచక్యంతో పాక్‌లోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేశారన్నారు. ఈ ఘనత నిస్సందేహంగా సైనికులదే అని కొనియాడారు. దేశ శౌర్య పరాక్రమాలను చాటిన సైనికులు, త్రివిధ దళాలకు సంఘీభావంగా నిర్వహించిన తిరంగా ర్యాలీకి ప్రజల నుంచి అపూర్వ మద్దతు లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సైనికులకు మద్దతుగా టీడీపీ ర్యాలీ

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజవంతమైన నేపథ్యంలో దేశ సైనికులకు కృతజ్ఞతలు తెలుపుతూ సత్యవేడులో టీడీపీ నియోజకవర్గ అబ్జర్వర్ చంద్రశేఖర్ నాయుడు, కో-ఆర్డినేటర్ శ్రీపతిబాబు ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. త్రివిధ దళాలకు సంఘీభావంగా జాతీయ జెండాలు చేతపట్టుకుని వందేమాతరం, జైహింద్ నినాదాలు చేస్తూ కాళహస్తి బస్టాండ్ నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశ రక్షణ కోసం ప్రాణాలను లెక్క చేయకుండా పోరాడుతున్న జవాన్లకు మద్దతుగా నిలవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, హేమభూషణం, షణ్ముగం, రాధయ్య, శివా నందం, సురేంద్రరెడ్డి, సుబ్రమణ్యం, సంపత్, సురేష్, రవి, కాటయ్య, ఆనందయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతతోనే స్వర్ణాంధ్ర సాకారం

సత్యవేడు, మే 17(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర సాకారం కోసం ప్రతి ఒక్కరు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని సత్యవేడు జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఏ.వెంకటనాగరాజు పిలుపు నిచ్చారు. శనివారం కోర్టు, తహసీల్దార్ కార్యాలయ ఆవరణలను శుభ్ర పరచారు. తహసీల్దార్ రాజశేఖర్, ఈవోపీఆర్డీ తరుణాక్ష రెడ్డి, వెలుగు ఏపీఎం డాంగేయాదవ్, సర్పంచ్ రమేష్, టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ రెడ్డి, పీఎస్ రాజు తదితరలు పాల్గొన్నారు.

నాగలాపురం (ఆంధ్రజ్యోతి): నాగలాపురంలో ఎంపీడీవో బాలాజీ నాయక్ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహించారు.

ప్రతి కొనుగోలుకూ బిల్లివ్వాలి

సత్యవేడు, మే 17 (ఆంధ్రజ్యోతి): రైతులు కొనుగోలు చేసే ఎరువులు, పురుగు మందులకు సంబంధించి డీలర్లు తప్పని సరిగా బిల్లులివ్వాలని సత్యవేడు ఏడీఏ సుబ్రమణ్యం తెలిపారు. శనివారం ఆత్మ కార్యాలయ భవనంలో డివిజన్‌లోని సత్యవేడు, నాగలాపురం, వరదయ్యపాళెం మండలాల పెస్టిసైడ్, ఫెర్టిలైజర్ డీలర్లతో ఖరీఫ్ ముందస్తు ప్రణాళికపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఖరీఫ్ ప్రారంభానికి ముందే డీలర్లు మందులు, విత్తనాలు, ఎరువులను తెప్పించాలన్నారు. స్టాక్ రిజిస్టర్‌ను ఎప్పటికప్పుడు నిర్వహించాలని, ధరల పట్టికను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనుమతులు కలిగిన విత్తనాలు, మందులనే విక్రయించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్సులను రద్దు చే స్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏవోలు మురళి, గౌరి, సంజీవరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రేణిగుంటలో భారీ వర్షం

రేణిగుంట, మే 17 (ఆంధ్రజ్యోతి): వేసవి తాపానికి అల్లాడిపోతున్న ప్రజలకు శనివారం సాయంత్రం కురిసిన వర్షం ఉపశమనం కలిగించింది. రేణిగుంట మండలంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మూగ ఎండ కాసింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి మబ్బులతో చల్లగాలులు వీచాయి. సాయంత్రం ఒక్కసారిగా ఈదురు గాలులతో మొదలైన వర్షం ఉరుములు మెరుపులతో అరగంట సేపు పడడంతో వాతావరణం చల్లగా మారింది.

ఇంటి పట్టాల సమస్యను పరిష్కరించండి



జేసీకి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే

వరదయ్యపాళెం, మే 17(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇల్లు లేని పేదలకు పట్టాలు పంపిణీ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదిమూలం జేసీ శుభం బన్సల్‌ను కోరారు. ఈ మేరకు శనివారం కలెక్టర్ కార్యాలయంలో జేసీకి వినతిపత్రం అందజేశారు. మండలంలో అర్హులైన లబ్ధిదారులకు ఇంటి పట్టాలు పంపిణీ చేయడానికి ల్యాండ్ అక్విజిషన్ ప్రక్రియ పూర్తయిందని వాటిని అర్హులైన పేదలకు వెంటనే పంపిణీ చేయాలని కోరారు. ఇక వరదయ్యపాళెంకు బీసీ బాలికల హాస్టల్‌ను ప్రభుత్వం మంజూరు చేసిందని దానిని త్వరగా ప్రారంభించాలని తెలిపారు. నియోజకవర్గంలో పేదల ఇంటి స్థలాలకు పొజిషన్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు ఏడు మండలాల తహసీల్దర్లకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

కట్టపుట్టాలమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ. 8.88 లక్షలు



రేణిగుంట, మే 17, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్ట పుట్టాలమ్మ ఆలయ హుండీ లెక్కింపు శనివారం జరిగింది. ఆలయ ఆవరణలో జరిగిన లెక్కింపును ఆలయ చైర్మన్ పాడి రాజేంద్ర పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రూ. 8,88,750 ఆదాయం వచ్చినట్టు తెలిపారు. లెక్కింపులో పంచాయతీ కార్యదర్శి రమేష్ బాబు, బుజ్జినాయుడు, మోహన్, శ్రీనివాసులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో సెల్ టవర్‌లో మంటలు



రేణిగుంట, మే 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్‌లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చలరేగాయి. ఈ సంఘటన శనివారం సాయంత్రం జరిగింది. జియో, ఎయిర్‌టెల్, బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల కోసం ఏర్పాటు చేసిన టవర్‌లోని కేబుళ్లను కోతులు ధ్వంసం చేశాయి. శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. వెంటనే సిబ్బంది అగ్నిమాపకశాఖకు, టవర్ నిర్వహించే వ్యక్తులకు సమాచారం అందించారు. అగ్నిమాపక శాఖ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

ఇంటి నుంచి అలిగి వెళ్లిపోయిన భార్య గుర్తించి భర్తకు అప్పజెప్పిన పోలీసులు



భార్యాభర్తలతో పోలీసులు

రేణిగుంట, మే 17 (ఆంధ్రజ్యోతి): భర్తపై కోపంతో ఇంటి నుంచి వెళ్లిపోయిన భార్యను గుర్తించి గాజుల మండ్యం పోలీసులు భర్తకు అప్పగించారు. సీఐ మంజునాథ్ రెడ్డి తెలిపిన వివరాలు... స్థానిక ఏఎస్ఆర్ కాలనీలో కాపురం ఉంటున్న దివాకర్ భార్య, భర్తపై మనస్థాపం చెంది ఈ నెల 13వ తేదీ ఇంటి నుంచి వెళ్లిపోయింది. బంధువులు, చుట్టు పక్క ప్రాంతాల్లో వెతికినా జాడ కనపడకపోవడంతో దివాకర్ గాజులమండ్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా తిరుపతి సమీపంలో ఉన్నట్లు గుర్తించారు. సంబంధిత ప్రదేశానికి వెళ్లి ఆమెను తీసుకొచ్చి భర్తకు అప్పగించారు.

తుడా చైర్మన్‌కు ముక్కంటి ప్రసాదాలు



శ్రీకాళహస్తి, మే 17(ఆంధ్రజ్యోతి): తుడా చైర్మన్‌గా నియమితులైన డాలర్స్ దివాకర్ రెడ్డిని ఆయన స్వగృహంలో శనివారం శ్రీకాళహస్తికి చెందిన టీడీపీ నాయకులు కన్నలి ప్రతాప్‌రెడ్డి, కన్నలి ప్రవీణ్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. కలంకారీ శేషవస్త్రంతో సత్కరించి ముక్కంటి ప్రసాదాలను అందజేశారు.

అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా ఇద్దరికి స్వల్ప గాయాలు



బుచ్చినాయుడుకండ్రిగ, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తడ - శ్రీకాళహస్తి రోడ్డు కాంపాళెం గిరిజన కాలనీ మలుపు దగ్గర అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా పడటంతో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. బీఎన్ కండ్రిగ నుంచి శుక్రవారం మతకముడికి చెందిన ముగ్గురు ట్రాక్టర్‌లో వెళ్తుండగా కాంపాళెం గిరిజన కాలనీ మలుపు దగ్గర ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ట్రాక్టర్ బోల్తా పడింది.

వేదోక్తంగా శనీశ్వరస్వామికి తైలాభిషేకం

శ్రీకాళహస్తి, మే 17(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న శనీశ్వరస్వామికి శనివారం వేదోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామిఅమ్మవార్ల అభిషేకం అనంతరం శనీశ్వరస్వామి సన్నిధిలో కలశ ప్రతిష్ట చేసి మొదట గణపతి, కలశ పూజలను చేశారు. అనంతరం స్వామివారిని నువ్వుల నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకించారు. అభిషేకం అనంతరం స్వామివారిని పలు పుష్పాలతో విశేషంగా అలంకరించారు. విశేష పూజలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు.